# అభ్యుదయం

*The Pride of Telugu national daily*

RNI: TEL TEL /2019/12836





**Wanted Reporters**

తెలుగు రాష్ట్రాల్లో నియోజక వర్గాల వారిగా విలేఖరులు కావలెను

తెలంగాణ :- 9700026263
ఆంధ్రప్రదేశ్:- 9885426263



పబ్లిషర్ :ఆంధ్రప్రదేశ్ & తెలంగాణ | ఆదివారం 04-10- 2026 | సంపుటి : 6 | సంచిక : 234 | ఎడిటర్ : ఆనంద్ రావు | పేజీలు : 8 | వెల : 3-00


## దేశంలో జరిగినవన్నీ అక్రమ ఎన్నికలే




- ఈవీఎంల పార్తిగా దుర్వినియోగం జరిగింది
-లోక్‌సభ, అసెంబ్లీలను తక్షణమే రద్దు చేయాలి
-మోదీ, అమిత్ షా అక్రమంగా పదవుల్లో ఉన్నారు
-కేంద్ర ప్రభుత్వంపై మల్లికార్జున ఖర్గే ఆరోపణలు

## ముమ్మందు ఆర్థిక సవాళ్లు తప్పవు

- అంతా బాగుందనుకుంటే ప్రమాదమే
- ప్రపంచ ఆర్థిక వ్యవస్థపై తీవ్ర ఒత్తిడి
- ఎల్లప్పుడూ అప్రమత్తంగా ఉండాలి
- ప్రపంచ దేశాల మధ్య విభేదాలు తప్పవు
- ఆర్‌బీఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా




## ఆస్పత్రుల నిర్మాణాల్లో వేగం పెంచండి




- ఆస్పత్రులలో సిబ్బంది కొరత లేకుండా చూడాలి
- సీజనల్ వ్యాధులపై అందరూ అప్రమత్తంగా ఉండాలి
- అన్ని రకాల వైద్య సేవలు అందుబాటులో ఉండాలి
- ప్రతివారం పురోగతిపై సమీక్ష నిర్వహించాలి
- విద్య, వైద్య శాఖలపై సమీక్షలో సీఎం రేవంత్?రెడ్డి
- సౌకర్యాల కల్పనపై అధికారులకు సీఎం దిశానిర్దేశం

హైదారాబాద్, **అభ్యుదయం**

రాష్ట్రంలో విద్య, వైద్యానికి సంబంధించిన క్షేత్రస్థాయి పరిస్థితులపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులకు పలు కీలక సూచనలు చేశారు. శనివారం సీఎంవో అధికారులతో సీఎం సమీక్ష నిర్వహించారు. రాష్ట్రంలో నిర్మాణంలో ఉన్న ప్రధాన ఆసుపత్రుల నిర్మాణం,పురోగతిపై



అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఎల్బీనగర్, అల్వాల్, వరంగల్, ఉస్మానియా ఆసుపత్రుల నిర్మాణ పనుల్లో వేగం పెంచాలని సూచించారు. ఆసుపత్రుల్లో వైద్యులు, ఇతర సిబ్బంది అవసరాలను గుర్తించి నియామక ప్రక్రియను మొదలు పెట్టాలని, ఆసుపత్రుల నిర్మాణం పూర్తయ్యే నాటికి సిబ్బంది కొరత లేకుండా చూడాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిని సీఎం ఆదేశించారు.

# ఆసియా క్రీడల్లో భారత్ జోరు

- 21 స్వర్ణాలు సహా 85 పతకాలు
- 4వ స్థానంలో నిలిచిన భారత్
  చివరిరోజూ భారత్ పథకాల పంట
- హాకీలోనూ 'డబుల్ గోల్డ్' కైవశం
- పురుషుల స్వర్ణం కూడా కైవసం
- ఫైనల్‌లో మలేషియాపై విజయం
- ముగిసిన జపాన్ ఆసియా క్రీడలు




న్యూఢిల్లీ, **అభ్యుదయం:** రెండు రోజుల క్రితం పతకాల పట్టికలో భారత్ టాప్-10లో కూడా లేదు. తర్వాత పుంజుకొని టాప్-5లోకి దూసుకొచ్చింది. ఆరంభంలో ఆశించిన స్థాయిలో రాణించలేకపోయినా.. చివరి రెండు రోజుల్లో భారత క్రీడాకారులు అద్భుతాలు చేశారు. వరుసగా స్వర్ణాలు సాధిస్తూ పతకాల వేటలో కొత్త ఊపు తీసుకొచ్చారు. హాకీ, క్రికెట్ నుంచి ఆర్చరీ, బాక్సింగ్, రెజ్లింగ్ వరకు సత్తా చాటారు. మొత్తంగా 21 స్వర్ణాలు సహా 85 పతకాలతో ఆసియా క్రీడల ప్రస్థానాన్ని 4వ స్థానంతో ముగించారు. కొన్ని విభాగాల్లో నిరాశ ఎదురైనా.. మరికొన్ని క్రీడల్లో సరికొత్త చరిత్ర సృష్టించారు.ఆసియా క్రీడల్లో భారత్ ప్రస్థానం ఒడుదొడుకులతో సాగింది.


- మిగతా 2లో పేజిలో


## క్వాలిటీ, క్వాంటిటీకి ప్రాధాన్యత ఇవ్వాలి



**గురుకులాల్లో విద్యా ప్రమాణాలతో మౌలిక వసతుల బలోపేతం**
**యూనిఫార్ములు, షూస్, పుస్తకాలు సకాలంలో అందాలి**
**శానిటేషన్, భద్రత, తాగునీరు, వంటశాలలపై ప్రత్యేక దృష్టి**
**సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ వెల్లడి**
**ఇంటర్మీడియట్ విద్యార్థులకు ప్రత్యేక కార్యాచరణ**

హైదారాబాద్, **అభ్యుదయం**

రాష్ట్రంలోని ఎస్సీ, ఎస్టీ గురుకులాలు, సాంఘిక సంక్షేమ శాఖ పరిధిలోని వసతి గృహాలు, ఆశ్రమ పాఠశాలల్లో విద్యార్థులకు మెరుగైన విద్యతో పాటు అవసరమైన మౌలిక వసతులు కల్పించడంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు. విద్యార్థులకు ప్రభుత్వం అందిస్తున్న యూనిఫార్ములు, షూస్, పుస్తకాలు తదితర వస్తువులు ఆలస్యం లేకుండా అందించాలని అధికారులను ఆదేశించారు.


మిగతా 2లో


## ఉపాధి లక్ష్యమే ఉన్నత విద్య పరమార్థం కావాలి



- ప్రతి విశ్వవిద్యాలయంలోనూ ఇంక్యుబేషన్ సెంటర్
- స్టార్టప్‌లు, ఆవిష్కరణల కోసం సెంటర్స్ ఏర్పాటు
- డిగ్రీతో పాటే నైపుణ్యాల సాధన నూతన ప్రమాణం కావాలి
- ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు వెల్లడి
- జేఎన్‌టీయూహెచ్‌లో వేడుకగా 'రీచ్-2026' సదస్సు

హైదారాబాద్, **అభ్యుదయం**

తరగతి గదికి, పరిశ్రమల అవసరాలకు మధ్య ఉన్న వ్యత్యాసాన్ని పూర్తిగా తగ్గించాలని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు విద్యా సంస్థలకు పిలుపునిచ్చారు. విద్యా వ్యవస్థ యువతలో ఆలోచనా శక్తిని పెంపొందించడమే కాకుండా, వారిలో నైపుణ్యాలను అందించేలా వాస్తవ ప్రపంచ సమస్యలకు పరిష్కారాలు చూపేలా సిద్ధం చేయాలని ఆకాంక్షించారు. తెలంగాణ ఉన్నత విద్యామండలి (టీజీసీహెచ్ఈ) ఆధ్వర్యంలో శనివారం కుకట్‌పల్లిలోని జేఎన్‌టీయూహెచ్‌లో నిర్వహించిన


మిగతా 2లో


## హుజూర్‌నగర్ నుంచే పోటీ చేస్తా



**తుంగతుర్తి నియోజకవర్గానికి మారను**
**మారుతున్నాననే వదంతులు నమ్మొద్దు**
**మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టీకరణ**


2లో


## తెలంగాణలో అపార్ట్‌మెంట్లకు ఫైర్ ఎన్‌ఓసీ..




- ఎత్తు పరిమితి 18 నుంచి 24 మీటర్లకు పెంపు
- నివాస అపార్ట్‌మెంట్‌లకు ఫైర్ ఎన్‌ఓసీ నిబంధన
- అక్టోబర్ 7 నుంచి అమల్లోకి రానున్న రూల్స్

## దేశంలో జరిగినవన్నీ అక్రమ ఎన్నికలే

న్యూఢిల్లీ, అక్టోబర్ 03 కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే కేంద్ర ప్రభుత్వంపై సంచలన ఆరోపణలు చేస్తూ, తీవ్రమైన డిమాండ్‌ను తెరపైకి తెచ్చారు. దేశంలో జరిగిన ఎన్నికలన్నీ అక్రమమని ఆరోపిస్తూ, లోక్‌సభతో పాటు అన్ని రాష్ట్రాల అసెంబ్లీలను తక్షణమే రద్దు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. కర్ణాటకలోని కలబుర్గిలో ఆయన మీడియాతో మాట్లాడుతూ, దేశంలో ప్రస్తుత పాలన మొత్తం చట్టవిరుద్ధమైన ఎన్నికల పునాదిపైనే నడుస్తోందని ఆరోపించారు. ఈవీఎంల దుర్వినియోగం, ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ (సర్)లో జరుగుతున్న అవకతవకల కారణంగానే ఈ డిమాండ్ చేస్తున్నట్లు ఖర్గే స్పష్టం చేశారు. "ఈ రోజు దేశం మొత్తం అక్రమ ఎన్నికల ద్వారానే నడుస్తోంది. మోదీ అక్రమ ప్రధాని, అమిత్ షా అక్రమ మంత్రి అని, దేశంలో ఎన్నికైన ముఖ్యమంత్రులందరూ అక్రమంగా ఆ పదవుల్లో ఉన్నట్టేనని అన్నారు. వాటన్నింటినీ రద్దు చేసి, కేవలం బ్యాలెట్ పత్రాలతోనే మళ్లీ ఎన్నికలు నిర్వహించాలి" అని చెప్పారు. ఈ అంశంపై కాంగ్రెస్ వర్కింగ్ కమిటీతో పాటు ఇండియా కూటమి భాగస్వామ్య పక్షాలతో కూడా చర్చించినట్లు ఖర్గే తెలిపారు. ఈ అక్రమాలకు వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా ఆందోళనలు చేపట్టాలని నిర్ణయించామని, అందులో భాగంగా అక్టోబర్ 6వ తేదీన ఢిల్లీలో విపక్ష ఎంపీలందరూ కలిసి ఎన్నికల సంఘం కార్యాలయానికి నిరసన ర్యాలీ నిర్వహిస్తారని వివరించారు. ఓటర్ల జాబితా నుంచి కొన్ని వర్గాల ప్రజల పేర్లను తొలగించే ప్రయత్నాలు జరుగుతున్నాయని, దీనిపై యువతలో చైతన్యం కల్పిస్తామని ఆయన పేర్కొన్నారు.

## తెలంగాణలో అపార్ట్‌మెంట్లకు ఫైర్ ఎన్ఓసీ..

హైదారాబాద్, అక్టోబర్ 03: తెలంగాణలో కొత్తగా నిర్మించే నివాస అపార్ట్‌మెంట్‌లకు సంబంధించి రాష్ట్ర అగ్నిమాపక శాఖ కీలక నిర్ణయం తీసుకుంది. భవన నిర్మాణానికి ముందు తీసుకోవాల్సిన ప్రొవిజనల్ ఫైర్ నో అబ్జెక్షన్ సర్టిఫికేట్ కోసం అవసరమైన కనీస ఎత్తు పరిమితిని 18 మీటర్ల నుంచి 24 మీటర్లకు పెంచింది. ఈ సవరించిన నిబంధన అక్టోబర్ 7వ తేదీ నుంచి అమల్లోకి వస్తుందని అగ్నిమాపక శాఖ అధికారులు తెలిపారు. ఇప్పటివరకు ఉన్న నిబంధనల ప్రకారం, 18 మీటర్లు లేదా అంతకంటే ఎక్కువ ఎత్తు ఉన్న నివాస భవనాలు నిర్మాణ అనుమతికి ముందే తప్పనిసరిగా ఫైర్ ఎన్ఓసీ పొందాల్సి ఉండేది. తాజా మార్పుతో 18 నుంచి 24 మీటర్ల మధ్య ఎత్తు ఉండే అపార్ట్‌మెంట్‌లకు (సుమారు 5 నుంచి 7 అంతస్తులు) కేవలం ఎత్తు కారణంగా ప్రొవిజనల్ ఎన్ఓసీ తీసుకోవాల్సిన అవసరం ఉండదు. అయితే, ఈ సడలింపు కేవలం నివాస భవనాలకు మాత్రమే వర్తిస్తుంది. పాఠశాలలు, ఆసుపత్రులు, హోటళ్లు, హాస్టళ్లు, వాణిజ్య సముదాయాలు, కార్యాలయాలు, పరిశ్రమలు వంటి ఇతర భవనాలకు ప్రస్తుతం ఉన్న అగ్నిమాపక భద్రతా నిబంధనలే కొనసాగుతాయని అధికారులు స్పష్టం చేశారు. బిల్డర్ల సంఘాలతో జరిపిన సంప్రదింపులు, అలాగే ఇటీవల అమల్లోకి వచ్చిన నేషనల్ బిల్డింగ్ కన్‌స్ట్రక్షన్ స్టాండర్డ్స్ 2026కు అనుగుణంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు అధికారులు వెల్లడించారు. బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్, ఏప్రిల్ 30న నేషనల్ బిల్డింగ్ కోడ్ ఆఫ్ ఇండియా 2016 స్థానంలో నేషనల్ బిల్డింగ్ కన్‌స్ట్రక్షన్ స్టాండర్డ్స్ 2026ను అమల్లోకి తెచ్చింది. ఈ నూతన జాతీయ ప్రమాణాల్లో నివాస భవనాల అగ్నిమాపక భద్రతకు 24 మీటర్ల ఎత్తును ఒక ముఖ్యమైన కొలమానంగా నిర్దేశించారు.అయితే, ఎన్ఓసీ పరిధిలోకి రానంత మాత్రాన భవనాలకు ప్రాథమిక అగ్నిమాపక భద్రతా ప్రమాణాల నుంచి మినహాయింపు ఉండదని అధికారులు తేల్చిచెప్పారు. నిర్మాణ సమయంలో ప్రమాదరహిత నిష్క్రమణ మార్గాలు, అత్యవసర లైటింగ్, ఫైర్ ఎక్స్‌టింగ్విషర్లు, ఎలక్ట్రికల్ భద్రత వంటి ఏర్పాట్లను తనిఖీ చేసేందుకు ఆకస్మిక తనిఖీలు నిర్వహిస్తామని తెలిపారు. ఈ అంశంపై కౌన్సిల్ ఫర్ ఫైర్ అండ్ లైఫ్ సేఫ్టీ వైస్ ప్రెసిడెంట్ ఎస్.పి. అంచురి స్పందిస్తూ, కేవలం భవనం ఎత్తు మాత్రమే అగ్నిప్రమాద తీవ్రతను నిర్ణయించదని హెచ్చరించారు.

## క్వాలిటీ, క్వాంటిటీకి ప్రాధాన్యత ఇవ్వాలి

డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ తెలంగాణ రాష్ట్ర సచివాలయంలో శనివారం గురుకులాలు, వసతి గృహాలు, ఆశ్రమ పాఠశాలల్లోద్వారా చేపడుతున్న కార్యక్రమాలపై మంత్రి సమీక్ష నిర్వహించారు. సంక్షేమ శాఖ ప్రత్యేక కార్యదర్శి సభ్య సాచి ఘోష్, కార్యదర్శి విజయేంద్ర బోయి ఉన్నతాధికారులతో ఈ సమీక్ష నిర్వహించారు. రాష్ట్ర స్థాయి నుంచి జిల్లాలకు చేరిన యూనిఫార్ములు, షూస్, పుస్తకాలు తదితర సామగ్రిని విద్యార్థులకు వెంటనే అందించాలని మంత్రి సూచించారు. సరఫరా ఎక్కడ నిలిచిపోయింది.. ప్రొక్యూర్‌మెంట్‌లో ఏమైనా సమస్యలు ఉన్నాయా.. అనే అంశాలను గుర్తించి జిల్లా కలెక్టర్లతో సమన్వయం చేసుకోవాలని అధికారులను ఆదేశించారు. ప్రతి అంశానికి నిర్దిష్ట గడువు నిర్ణయించి, పురోగతిపై నివేదికలు తీసుకోవాలని సూచించారు.వందలాది మంది విద్యార్థులు ఉండే పెద్ద క్యాంపస్‌లలో ప్రస్తుత పారిశుద్ధ్య సిబ్బంది సరిపోతున్నారా అనే అంశాన్ని పరిశీలించాలని మంత్రి ఆదేశించారు. అవసరమైన చోట్ల పారిశుద్ధ్య, స్కావెంజింగ్ సేవలను సమర్థంగా నిర్వహించేందుకు తగిన విధానం రూపొందించాలన్నారు. స్థానిక అవసరాలను బట్టి కాంటింజెన్సీ సిబ్బందిని వినియోగించడంతో పాటు, అవసరమైతే పారదర్శక ఆన్‌లైన్ టెండర్ విధానాన్ని పరిశీలించాలని సూచించారు. ప్రస్తుతము సిబ్బందికి అందిస్తున్న వేతనాలు చాలా తక్కువ ఉన్నాయి అని వాటిని పెంచేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని మంత్రి అధికారులు ఆదేశించారు. గురుకులాలను పూర్తి స్థాయిలో మరింత తీర్చిదిద్దేందుకు విద్యార్థుల సంఖ్య, స్థానిక అవసరాలకు అనుగుణంగా సమగ్ర మౌలిక వసతుల ప్రణాళిక రూపొందించాలని మంత్రి సూచించారు. తరగతి గదులు, వంటశాలలు, తాగునీరు, ఆర్ఓ ప్లాంట్లు, వాషింగ్ సదుపాయాలు, శానిటేషన్, అవసరమైన పరికరాలను ఒకే ప్రణాళికలో చేర్చాలన్నారు. ఇప్పటికే అమలులో ఉన్న మంచి ఇంటిగ్రేటెడ్ బిల్డింగ్ నమూనాలను పరిశీలించి, అనువైన వాటిని ఇతర ప్రాంతాల్లోనూ అమలు చేసే అవకాశాలను పరిశీలించాలని తెలిపారు. విద్యార్థుల భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని, అవసరమైన చోట్ల భద్రతా సిబ్బంది, పోలీసు సమన్వయం, సీసీ కెమెరాల ఏర్పాటుపై సమగ్రంగా పరిశీలించాలని ఆదేశించారు. ముఖ్యంగా బాలికల గురుకుల విద్యాలయాల సంస్థల లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి వాటిని స్థానిక పోలీస్ స్టేషన్ కు అనుసంధానం చేయాలని మంత్రి ఆదేశించారు. గురుకులాల్లో విద్యా ప్రమాణాల పెంపుపై ప్రత్యేక దృష్టి పెట్టాలని మంత్రి సూచించారు. బోధనా విధానంలో ఏకరూపత తీసుకురావడంతో పాటు గతంలో ఎదురైన బోధనా సమస్యలను గుర్తించి పరిష్కరించాలన్నారు.

# ఆస్పత్రుల నిర్మాణాల్లో వేగం పెంచండి



ఆసుపత్రుల్లో అవసరమైన అత్యాధునిక పరికారాలను కొనుగోలు చేసి, ఆసుపత్రుల నిర్మాణం పూర్తయ్యేనాటికి అన్ని రకాల వైద్య సేవలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు.

జిల్లా కలెక్టర్లు క్షేత్ర స్థాయిలో పర్యటించేలా చూడాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. జిల్లా కలెక్టర్లతో పాటు అధికారులు క్షేత్రస్థాయిలో ప్రభుత్వ పాఠశాలలు, సోషల్ వెల్ఫేర్ హాస్టల్స్, ఆసుపత్రులను సందర్శించాల్సిందేనని స్పష్టం చేశారు. సంబంధిత జిల్లాకు సంబంధించి జిల్లా స్థాయిలో ప్రతీ వారం వీటిపై సమీక్ష నిర్వహించాలన్నారు. సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. పాఠశాలల్లో అవసరమైన చోట మరమ్మతు పనులను చేపట్టాలని తెలిపారు. డిసెంబరులో భారత్ ఫ్యూచర్ సిటీలో నిర్వహించ తలపెట్టిన తెలంగాణ గ్లోబల్ సమ్మిట్-2026 ఏర్పాట్లపైనా సమావేశంలో అధికారులతో చర్చించారు. సమ్మిట్ ఏర్పాట్లు, అతిథులు, పెట్టుబడుల విషయంలో పకడ్బందీగా ప్రణాళికలు సిద్ధం చేయాలని సీఎం సూచించారు.

త్వరలోనే ఏర్పాట్లను పరిశీలిస్తానని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో ఎంపీ వేం నరేందర్ రెడ్డి, ప్రభుత్వ సలహాదారు రామకృష్ణారావు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు, డీజీపీ సీవీ ఆనంద్, సీఎంవో ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

### ముమ్ముందు ఆర్థిక సవాళ్లు తప్పదు

న్యూఢిల్లీ, అక్టోబర్ 03 ప్రపంచ ఆర్థిక వ్యవస్థ ప్రస్తుతం అనేక సవాళ్లను ఎదుర్కొంటోందని ఆర్‌బీఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా అన్నారు. ప్రపంచ దేశాల మధ్య విభేదాలు, వాణిజ్య ఆంక్షలు, సరఫరా సమస్యలు, సాంకేతిక మార్పులు, వాతావరణ మార్పులు ఆర్థిక వ్యవస్థపై ప్రభావం చూపుతున్నాయని చెప్పారు. ఈ పరిస్థితుల్లో ఆర్థిక ముప్పుల విషయంలో ఎప్పుడూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కోవిడ్ తర్వాత ప్రపంచం ఎన్నో ఆర్థిక, ఇతర సంక్షోభాలను ఎదుర్కొందని మల్హోత్రా తెలిపారు. అయినా ప్రపంచ ఆర్థిక వ్యవస్థ వాటిని తట్టుకుని నిలబడిందన్నారు. భారత్‌లోనూ చాలాకాలంగా ఆర్థిక పరిస్థితులు స్థిరంగా ఉన్నాయని చెప్పారు. అయితే ఇదే స్థిరత్వం మరో సమస్యకు దారి తీయొచ్చని ఆయన హెచ్చరించారు. చాలాకాలం ఎలాంటి పెద్ద సంక్షోభం రాకపోతే గతంలో ఎదురైన సమస్యలను ప్రజలు, సంస్థలు మర్చిపోతారని అన్నారు. దీంతో ఎక్కువ రిస్క్ తీసుకోవడం, భారీగా అప్పులు చేయడం పెరిగే అవకాశం ఉందని చెప్పారు. బ్యాంకింగ్, ఆర్థిక రంగాల్లో సమస్యలు ఒక్కసారిగా బయటపడే అవకాశం ఉందని మల్హోత్రా తెలిపారు. అయితే వాటిని పూర్తిగా పరిష్కరించడానికి మాత్రం చాలా సమయం పడుతుందని చెప్పారు. అందుకే పరిస్థితులు బాగున్న సమయంలోనే జాగ్రత్తగా ఉండాలని సూచించారు. ప్రపంచ ఆర్థిక వ్యవస్థను గతంలో నడిపించిన విధానాల్లో ఇప్పుడు మార్పులు వస్తున్నాయని ఆయన పేర్కొన్నారు. దేశాల మధ్య రాజకీయ, ఆర్థిక విభేదాలు పెరుగుతున్నాయని చెప్పారు. వాణిజ్య ఆంక్షలు, సరఫరా అంతరాయాలు కూడా తరచూ ఎదురవుతున్నాయని తెలిపారు. ఈ మార్పులన్నీ ఒకదానితో ఒకటి కలిసి ప్రభావం చూపుతున్నాయని మల్హోత్రా అన్నారు

# ఉపాధి లక్ష్యమే ఉన్నత విద్య పరమార్థం కావాలి

'రీచ్--2026' (రిసెర్చ్, ఎడ్యుకేషన్ అండ్ అడ్వాన్స్‌మెంట్) సదస్సులో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. తరగతి గది నుంచి భవిష్యత్ కెరీర్ వైపు, విద్య నుంచి నైపుణ్యాల వైపు, పరిశోధన నుంచి పారిశ్రామిక రంగానికి నిరంతర అనుసంధానం ఉండాలని మంత్రి పేర్కొన్నారు. మన విద్యా వ్యవస్థ కేవలం డిగ్రీ సర్టిఫికెట్లు అందించే విధానం నుంచి, విద్యార్థులకు ఆచరణాత్మక నైపుణ్యాలు అందించే దిశగా మారాలన్నారు. కోర్సు పూర్తయిన వెంటనే విద్యార్థి ఉద్యోగానికి అర్హత సాధించాలని, పట్టా చేతికి వచ్చే సమయానికే ఆ స్థాయి సన్నద్ధత ఉండాలని పునరుద్ఘాటించారు. విద్యార్థులు, పరిశోధకులు తమ ఆలోచనలను స్టార్టప్‌లుగా, నూతన ఉత్పత్తులుగా మలచడానికి వీలుగా ప్రతి విశ్వవిద్యాలయంలో ఇంక్యుబేషన్ సెంటర్‌ను ఏర్పాటు చేయాలని మంత్రి సూచించారు. కరికులమ్ రూపకల్పన, ల్యాబ్‌ల నిర్వహణ, ఇంటర్న్‌షిప్‌లు, లైవ్ ప్రాజెక్టులు, పరిశోధనల్లో పరిశ్రమలు భాగస్వామ్యమవ్వాలని విజ్ఞప్తి చేశారు. "ఒక చేతిలో డిగ్రీ.. మరో చేతిలో నైపుణ్యం" ఉండటమే మన నూతన ప్రామాణికం కావాలన్నారు. టాటా టెక్నాలజీస్ భాగస్వామ్యంతో 65 ప్రభుత్వ ఐటీఐలను రోబోటిక్స్, ఆటోమేషన్, ఇండస్ట్రీ 4.0 వంటి ఆధునిక సాంకేతిక పరిజ్ఞాన కేంద్రాలుగా (ఏటీసీ) తీర్చిదిద్దుతున్నామని వెల్లడించారు.

'యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ' ద్వారా సరికొత్త విద్యా, నైపుణ్య వ్యవస్థను నిర్మిస్తున్నామని తెలిపారు.

'తెలంగాణ రైజింగ్ ఏ2047' లక్ష్యంతో ఉన్నత విద్యను ప్రపంచస్థాయిలో తీర్చిదిద్దడం, పరిశోధనల్లో ప్రతిభను పెంచడం, ఆవిష్కరణల వ్యవస్థను బలోపేతం చేయడంపై ఈ సదస్సులో విస్తృతంగా చర్చించారు. ఈ కార్యక్రమంలో సైయెంట్ వ్యవస్థాపక ఛైర్మన్ డాక్టర్ బి.వి.ఆర్. మోహన్ రెడ్డి, టీజీసీహెచ్‌ఈ ఛైర్మన్ ప్రొఫెసర్ వి. బాలకిష్టారెడ్డి, జేఎన్‌టీయూహెచ్ విసి ప్రొఫెసర్ టి. కిషన్ కుమార్ రెడ్డి, ఉస్మానియా వర్సిటీ విసి ప్రొఫెసర్ ఎం. కుమార్, ప్రొఫెసర్ పురుషోత్తంలతో పాటు వివిధ వర్సిటీల ఉపకులపతులు, 60కి పైగా ఉన్నత విద్యాసంస్థల ప్రతినిధులు, పారిశ్రామికవేత్తలు పాల్గొన్నారు.

విశ్వవిద్యాలయాలు, పరిశ్రమల మధ్య కుదిరే నూతన భాగస్వామ్యాలు, ఉమ్మడి పరిశోధనలు, స్టార్టప్‌లు, విద్యార్థులకు లభించే ఉపాధి అవకాశాల ప్రాతిపదికన మాత్రమే ఈ 'రీచ్' సదస్సు విజయాన్ని అంచనా వేయగలమని నిపుణులు అభిప్రాయపడ్డారు. విద్యార్హతలకు, పారిశ్రామిక అవసరాలకు ఉన్న వ్యత్యాసాన్ని కేవలం చర్చించడమే కాకుండా పూర్తిగా తుడిచిపెట్టేందుకు పరిశ్రమలు, విద్యాసంస్థలు చేయి చేయి కలపాలని మంత్రి శ్రీధర్ బాబు పిలుపునిచ్చారు.

# ఆసియా క్రీడల్లో భారత్ జోరు

గురువారం నాటికి ఖాతాలో 10 స్వర్ణాలు మాత్రమే ఉన్నాయి. పతకాల పట్టికలో టాప్-10 కింద నిలిచింది. అయితే చివరి రెండు రోజుల్లో సీన్ మారిపోయింది. క్రికెట్, హాకీ జట్లు పసిడి పతకాలు సాధించాయి. ఆర్చరీ, బాక్సింగ్, రెజ్లింగ్‌లోనూ భారత క్రీడాకారులు మెరిశారు. దీంతో చివరి రెండు రోజుల్లోనే మరో 11 స్వర్ణాలు ఖాతాలో చేరాయి. భారత్ టాప్-5లోకి దూసుకొచ్చింది.ఈసారి భారత హాకీ జట్లు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. మహిళల జట్టు 44 ఏళ్ల నిరీక్షణకు తెరదించుతూ స్వర్ణం గెలుచుకుంది. పురుషుల జట్టు కూడా మలేసియాపై 5-1తో ఘన విజయం సాధించి టైటిల్‌ను నిలబెట్టుకుంది. ఒకే ఆసియా క్రీడల్లో పురుషులు, మహిళల జట్లు స్వర్ణాలు గెలవడం ఇదే తొలిసారి. ఈ విజయాలతో రెండు జట్లూ 2028 లాస్‌ఏంజెల్స్ ఒలింపిక్స్‌కు నేరుగా అర్హత సాధించాయి. క్రికెట్‌లోనూ పురుషులు, మహిళలు స్వర్ణాలు గెలిచి భారత్ ఖాతాలో పసిడి పతకాలు జమ చేశారు. కబడ్డీలోనూ ఇరు జట్లు స్వర్ణ విజేతలుగా నిలిచాయి. ఆర్చరీలో భారత క్రీడాకారులు అద్భుత ప్రదర్శన చేశారు. ఈ విభాగంలో ఐదు స్వర్ణాలు సహా మొత్తం 9 పతకాలు సాధించారు. మహిళల వ్యక్తిగత రికర్వ్‌లో 17 ఏళ్ల కుమ్‌కుమ్ స్వర్ణం గెలిచి చరిత్ర సృష్టించింది. ఆసియా క్రీడల్లో ఈ విభాగంలో స్వర్ణం



సాధించిన తొలి భారత మహిళగా నిలిచింది. మహిళల రికర్వ్ జట్టు కూడా తొలిసారి పసిడి పతకాన్ని అందుకుంది. నీరు ధండా షూటింగ్‌లో మహిళల ట్రాప్ విభాగంలో స్వర్ణం గెలిచి ప్రత్యేక గుర్తింపు తెచ్చుకుంది. గోల్ఫ్‌లో ప్రణవి ఉర్స్ వ్యక్తిగత స్వర్ణంతో మెరిసింది.భారత్‌కు అత్యధిక పతకాలు అందించింది అథ్లెటిక్సే. ఈ విభాగంలో 24 పతకాలు వచ్చాయి. ఒక స్వర్ణం, 9 రజతాలు, 14 కాంస్యాలు దక్కాయి. షూటింగ్‌లో 15, ఆర్చరీలో 9 పతకాలు లభించాయి. బాక్సింగ్, రెజ్లింగ్‌లో చెరో ఆరు పతకాలు వచ్చాయి. రెజ్లింగ్‌లో అమన్ శెహ్రావత్, సుజీత్ కల్కల్ స్వర్ణాలు సాధించగా.. లవ్లీనా బోర్గోహెయిన్, పర్వీన్ హూడా, అంకుశ్ పంఘాల్ బాక్సింగ్‌లో పసిడి పతకాలు గెలిచారు. గత ఆసియా క్రీడలతో పోలిస్తే ఈసారి భారత్ పతకాల సంఖ్య తగ్గింది. 2022 హాంగ్‌జౌ క్రీడల్లో 106 పతకాలు సాధించిన భారత్.. ఈసారి 85 పతకాలకే పరిమితమైంది.

### హుజూర్‌నగర్ నుంచే పోటీ చేస్తా

హైదారాబాద్, : తెలంగాణ నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి తన రాజకీయ భవిష్యత్తుపై వస్తున్న ఊహాగానాలకు తెరదించారు. వచ్చే ఎన్నికల్లో తాను హుజూర్‌నగర్ నియోజకవర్గం నుంచే పోటీ చేస్తానని ఆయన స్పష్టం చేశారు. డీలిమిటేషన్ తర్వాత తుంగతుర్తికి మారవచ్చంటూ సోషల్ మీడియాలో జరుగుతున్న ప్రచారాన్ని ఆయన కొట్టిపారేశారు. ప్రస్తుతం ఉత్తమ్ కుమార్ రెడ్డి హుజూర్‌నగర్ అసెంబ్లీ నియోజకవర్గానికి ప్రాతినిధ్యం వహిస్తున్నారు. ఈరోజు హైదరాబాద్‌లో మీడియాతో మాట్లాడిన ఉత్తమ్ కుమార్ రెడ్డి... తన నియోజకవర్గం మార్పుపై వస్తున్న వదంతులను ఎవరూ నమ్మవద్దని కోరారు. తుంగతుర్తి నియోజకవర్గ పరిధిలోని తన స్వగ్రామం తాటిపాములలో అభివృద్ధి పనులు వేగంగా జరుగుతున్నాయని, అంత మాత్రాన అక్కడి నుంచి పోటీ చేస్తాననడం అవాస్తవమని తెలిపారు. ఈ సందర్భంగా కాళేశ్వరం ప్రాజెక్టు మరమ్మ తులపై కూడా ఆయన కీలక వ్యాఖ్యలు చేశారు. డిజైన్‌కు సంబంధించిన లోపాలుంటే, ఆ ఖర్చును ప్రభుత్వమే భరిస్తుందని స్పష్టం చేశారు.

# విద్యార్థిని అభినందించిన సంక్షేమ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్

హైదారాబాద్, అక్టోబర్ 03 సంకల్పం.. క్రమశిక్షణ.. పట్టుదల ఉంటే ఎంతటి ఎత్తయిన లక్ష్యాన్నైనా చేరుకోవచ్చని తెలంగాణ గిరిజన గురుకుల విద్యార్థి ఇస్లావత్ బన్నీ నిరూపించారు. హిమాచల్‌ప్రదేశ్‌లోని 6,027 మీటర్ల (19,774 అడుగుల) ఎత్తైన మౌంట్ తరంగ్-2 శిఖరాన్ని అధిరోహించి చారిత్రక ఘనత సాధించారు. తెలంగాణగిరిజన సంక్షేమ గురుకుల డిగ్రీ కళాశాల), కామారెడ్డిలో బీకాం చివరి సంవత్సరం చదువుతున్న బన్నీ ఈ నెల 22న అధిరోహించారు. సెప్టెంబరు 30న తిరిగి తిరిగి సురక్షితంగా వచ్చారు. ఈ సందర్భంగా డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ తెలంగాణ సచివాలయంలో శనివారం సంక్షేమ శాఖ మంత్రి శ్రీ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ ..బన్నీని శాలువాతో సత్కరించి అభినందించారు. విద్యార్థి సాధించిన ఘనతను మంత్రి ప్రశంసించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. “బన్నీ సాధించిన విజయం ఒక్క విద్యార్థి విజయమే కాదు.. తెలంగాణలోని ప్రతి గురుకుల విద్యార్థికి స్ఫూర్తినిచ్చే ఘనత. చదువుతో పాటు క్రీడలు, సాహస క్రీడలు, ఇతర రంగాల్లోనూ విద్యార్థులు తమ ప్రతిభను చాటుకోవాలి. లక్ష్యం ఎంత ఎత్తులో ఉన్నా దాన్ని చేరుకోవాలనే పట్టుదల, క్రమశిక్షణ, నిరంతర సాధన ఉంటే విజయాన్ని సాధించవచ్చు” అని అన్నారు. “ప్రతికూల పరిస్థితులు ఎదురైనప్పుడు వెనక్కి తగ్గకుండా ముందుకు సాగడమే నిజమైన క్రీడాస్ఫూర్తి. గెలుపు మాత్రమే కాదు.. సవాళ్లను ధైర్యంగా ఎదుర్కొనే మనస్తత్వాన్ని కూడా క్రీడలు, సాహస కార్యక్రమాలు పెంపొందిస్తాయి. బన్నీ విజయాన్ని స్ఫూర్తిగా తీసుకుని మరింత మంది గురుకుల విద్యార్థులు క్రీడలు, సాహస రంగాల్లో ముందుకు రావాలి” అని మంత్రి ఆకాంక్షించారు. గిరిజన విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీసేందుకు ప్రభుత్వం, గురుకుల సంస్థలు అవసరమైన ప్రోత్సాహాన్ని అందిస్తాయని మంత్రి తెలిపారు. “మన విద్యార్థులు చదువులోనే కాదు.. క్రీడలు, సాహస కార్యక్రమాలు, పరిశోధన, కళలు తదితర అన్ని రంగాల్లోనూ తమ ప్రతిభను చాటుకునేలా అవకాశాలు కల్పించాలి. ఒక విద్యార్థి విజయం మరెంతో మంది విద్యార్థులకు దారిచూపాలి” అని పేర్కొన్నారు. మౌంట్ తరంగ్-2 శిఖరం సముద్రమట్టానికి 6,027 మీటర్ల ఎత్తులో ఉంది. అత్యంత క్లిష్టమైన పర్వతారోహణలో పాల్గొన్న భారతీయ బృందంలో బన్నీ భాగస్వామిగా నిలిచారు. సెప్టెంబరు 22న శిఖరాన్ని అధిరోహించి భారతీయ పర్వతారోహణ



రంగంలో తనదైన ముద్ర వేశారు. సొసైటీ కార్యదర్శి కె. సీతాలక్ష్మి బన్నీని అభినందిస్తూ.. మౌంట్ తరంగ్-2ను అధిరోహించిన తొలి భారతీయ బృందంలో బన్నీ భాగస్వామిగా నిలవడం గిరిజన గురుకుల సొసైటీకి గర్వకారణమన్నారు. విద్యార్థుల్లో దాగి ఉన్న క్రీడా, సాహస ప్రతిభను వెలికితీసేందుకు సొసైటీ నుంచి అవసరమైన ప్రోత్సాహం, సహకారం అందిస్తామని తెలిపారు. బన్నీ విజయంపై అధికారులు, కళాశాల సిబ్బంది, తోటి విద్యార్థులు హర్షం వ్యక్తం చేశారు. విద్యార్థులలో ఆత్మవిశ్వాసం, నాయకత్వ లక్షణాలు, సాహస స్ఫూర్తిని పెంపొందించేందుకు ఇటువంటి కార్యక్రమాలను ప్రోత్సహించాల్సిన అవసరం ఉందని ఆమె పేర్కొన్నారు.

## అర్హులైన ప్రతి ఒక్క గ్రాడ్యుయేట్ ఓటరుగా నమోదు చేసుకోవాలి

**మాజీ మంత్రి, ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్**



హైదారాబాద్, అక్టోబర్ 03
రానున్న గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికలకు ప్రతి ఒక్క గ్రాడ్యుయేట్ ఓటరుగా తమ పేర్లను నమోదు చేసుకోవాలని మాజీ మంత్రి, ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ కోరారు. సనత్ నగర్ నియోజకవర్గంలోని రాంగోపాల్ పేట డివిజన్ నల్లగుట్ట లో గ్రాడ్యుయేట్ ఓటరు నమోదు కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా సభ్యత్వ నమోదు పత్రాలను పలువురు గ్రాడ్యుయేట్లు ఎమ్మెల్యే తలసాని కి అందజేశారు. బీఆర్‌ఎస్ శ్రేణులు ఇంటింటికీ వెళ్లి గ్రాడ్యుయేట్ లను గుర్తించి ఓటరుగా నమోదు చేసుకునేలా అవగాహన కల్పించాలని పిలుపునిచ్చారు. ఆయన వెంట బీఆర్‌ఎస్ నాయకులు పాల్గొన్నారు.

## సీపీ సజ్జనార్‌కు హైకోర్టు నోటీసులు




హైదారాబాద్, అక్టోబర్ 03 హైదరాబాద్ భవానీనగర్ పోలీస్ స్టేషన్లో కస్టడీ వేధింపులపై తగిన విచారణ చేపట్టి బాధ్యులపై చర్యలు తీసుకోవాలంటూ ఆగస్టు 13న ఇచ్చిన ఆదేశా లను అమలు చేయకపోవడాన్ని సవాలు చేస్తూ మహ్మద్ షానవాజ్ ఆలం హైకోర్టులో కోర్టు ధిక్కరణ పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై జస్టిస్ టి. మాధవీదేవి విచా రణ చేపట్టారు.పిటిషనర్ తరపు న్యాయ వాది వాదనలు వినిపిస్తూ ఎలాంటి క్రిమి నల్ కేసులు లేకపోయినా పిటిషనర్ను ఆగస్టు 6న పోలీసులు తీసుకెళ్లి చిత్రహింసలకు గురి చేశారన్నారు. దీనిపై కమిషనర్ తో సహా అధికా రులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోకపోవడంతో ఈ కోర్టులో పిటిషన్ దాఖలు చేసినట్లు తెలిపారు. దీనిపై విచారించిన కోర్టు సీసీటీవీ ఫుటేజీని పరిశీలించి ఒకవేళ ఆరోపణలు వాస్తవమైతే బాధ్యులపై చర్యలు తీసుకోవాలంటూ ఆగస్టు 13న కమిషనర్ ను ఆదేశించినా చర్యలు తీసుకో లేదన్నారు. అందువల్ల కమిషనర్పై కోర్టు ధిక్కరణ కింద చర్యలు తీసు కోవాలని కోరారు. వాదనలను విన్న న్యాయమూర్తి ప్రతివాది అయిన పోలీసు కమిషనర్ వి.సి.సజ్జనారు నోటీసులు జారీ చేస్తూ విచారణను నవంబరు 6కు వాయిదా వేశారు.

## ఈనెల 10నుండి బతుకమ్మ వేడుకలు

- 18వరకు అత్యంత వైభవంగా నిర్వహణ
- రాష్ట్ర ప్రభుత్వ సిఎస్ సంజయ్ జాజు వెల్లడి
- బతుకమ్మ వేడుకల ఏర్పాట్లపై సిఎస్ సమీక్ష



హైదారాబాద్, అక్టోబర్ 03: తెలంగాణా సంస్కృతీ ప్రత్యేకత గాంచిన బతుకమ్మ పూల పండగను ఈనెల 10 వ తేదీనుండి 18 వ తేదీ వరకు అత్యంత వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్టు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు వెల్లడించారు. ఈనెల 10 నుండి 18 వ తేదీ వరకు నిర్వహించే బతుకమ్మ వేడుకల ఏర్పాట్ల పై శనివారం డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో ఉన్నతస్థాయి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో వివిధ శాఖల కార్యదర్శులు, పోలీస్ అధికారులు హాజయ్యారు. ఈ సందర్భంగా సిఎస్ ఈనెల 18 వ తేదీన సద్దుల బతుకమ్మ ను పురస్కరించుకొని ట్యాంక్ బండ్ పై వేలాది మంది మహిళలచే సద్దుల బతుకమ్మ ఉత్సవాన్ని అత్యంత వైభంగా నిర్వహిస్తున్నట్టు తెలిపారు. 18వ తేదీ సాయంత్రం 4 గంటలకు సచివాలయం ఎదురుగాగల అమరవీరుల స్మారక కేంద్రం నుండి వేలాది మంది మహిళలు బతుకమ్మలతో ఊరేగింపుగా వచ్చి ట్యాంక్ బండ్ పైకి చేరుకుంటారని, వీరితోపాటు వందలాది మంది కళాకారులు తమ కళారూపాలతో ర్యాలీగా వస్తారని వివరించారు. ట్యాంక్ బండ్ పై ఏర్పాటు చేసే ప్రత్యేక వేదిక వద్ద జరిగే ఈ బతుకమ్మ ఉత్సవాలకు ప్రజాప్రతినిధులు హాజరవుతారని అన్నారు. ఈ బతుకమ్మ ఉత్సవాలను పురస్కరించుకొని పండగ శోభ వచ్చేలా నగరంలోని ప్రధాన కూడళ్లలో బతుకమ్మలను ఏర్పాటు చేయడమే కాకుండా పలు జంక్షన్ల కేంద్రాల వద్ద విధ్యుత్ దీపాలతో అలంకరించాలని ఆదేశించారు. నగరంలోని అన్ని ప్రధాన కార్యాలయాలను కూడా విద్యుత్ దీపాలతో అలంకరించాలని సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. ట్యాంక్ బండ్ పై బతుకమ్మ ఆడేందుకు సమీపంలోని వాడలు, కాలనీలు, బస్తీల నుండి పెద్ద ఎత్తున మహిళలు వచ్చే అవకాశమున్నందున వారికి ఏవిధమైన ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. అదేవిధంగా, ట్యాంక్ బండ్ చిల్డ్రన్స్ పార్క్ లో ఉన్న బతుకమ్మ ఘాట్ తోపాటు నెక్లెస్ రోడ్డులో బతుకమ్మ ల నిమజ్జనానికి ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని హెచ్ఎండీఏ, జీహెచ్ ఎంసీ అధికారులను సిఎస్ ఆదేశించారు. సాయంత్రం 5 నుండి రాత్రి 10 గంటల మధ్య ట్యాంకు బండ్ పై బతుకమ్మ ఉత్సవాలు జరుగుతున్నందున ట్రాఫిక్ డైవర్షన్, బారికేడింగ్, కనీస సౌకర్యాల ఏర్పాట్లను చేపట్టాలని తెలిపారు. అమరవీరుల స్మారక కేంద్రం నుండి ట్యాంక్ బండ్ వరకు ప్రత్యేకంగా బారికేడింగ్, లైటింగ్ సౌకర్యాలను కల్పించాలని సూచించారు. బతుకమ్మ జరిగే పది రోజుల పాటు రవీంద్ర భారతిలో బతుకమ్మ ఉత్సవాలను నిర్వహిస్తున్నందున అక్కడ కూడా ప్రత్యేక ఏర్పాట్లు చేపట్టాలని అన్నారు. రాష్ట్రంలోని అన్ని టూరిజం కేంద్రాలు, ప్రముఖ ప్రాంతాల్లోనూ బతుకమ్మ బతుకమ్మ ఉత్సవాలను ప్రతిబింబించేలా ఈసారి ప్రత్యేక లోగోను రూపొందిస్తున్నామని వెల్లడించారు. డిసెంబర్ లో జరుగనున్న తెలంగాణ గ్లోబల్ సమ్మిట్ ను కూడా ఈ లోగోలో తెలియచేసే విధంగా రూపొందించనున్నట్టు తెలిపారు. ఈ సమావేశంలో పర్యాటక, సాంస్కృతిక శాఖ ప్రత్యేక కార్యదర్శి వాణి ప్రసాద్, సీపీ హైదరాబాద్ వీసీ సజ్జనార్, పంచాయితీ రాజ్ కమిషనర్ దివ్య, జిహెచ్ ఎం సి కమిషనర్ ఆర్.వి.కర్ణన్, ఆర్టీసీ ఎం.డి. నాగిరెడ్డి, సీపీ మల్కాజిగిరి బి.సుమతి, జాయింట్ పోలీస్ కమిషనర్ (ట్రాఫిక్), హైదరాబాద్ జోయెల్ డేవిస్, టూరిజం డైరెక్టర్ రంజిత్ నాయక్, శిల్పారామం, సంస్కృతిక శాఖ డైరెక్టర్ ఎ. నర్సింహారెడ్డి, ప్రత్యేక అధికారి కిషన్ రావు తదితరులు పాల్గొన్నారు.

# యూపీలో కాంగ్రెస్‌కు 50 సీట్లు కూడా ఎక్కువే

- సమాజ్‌వాదీ ఎంపీ శివ్‌పాల్ సింగ్ పటేల్
- యూపీలో సీట్ల పంపకాలపై నెలకొన్న రగడ
- ఎస్పీ, కాంగ్రెస్ పార్టీల మధ్య రాజుకున్న వేడి

ఉత్తర్‌ప్రదేశ్, అక్టోబర్ 03 ఉత్తర్‌ప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికలకు ముందే సమాజ్‌వాదీ పార్టీ (ఎస్పీ), కాంగ్రెస్ మధ్య సీట్ల పంపకంపై మాటల యుద్ధం మొదలైంది. కాంగ్రెస్ కనీసం 150 స్థానాల్లో పోటీ చేయాలని చెబుతుండగా.. 50 సీట్లు కూడా ఎక్కువేనని ఎస్పీ ఎంపీ శివ్‌పాల్ సింగ్ పటేల్ అన్నారు. కాంగ్రెస్ తన బలాన్ని బట్టి సీట్లు కోరాలని సూచించారు. కాంగ్రెస్‌కు 50 సీట్లు ఇస్తేనే పెద్ద విషయమని పటేల్ వ్యాఖ్యానించారు. ప్రస్తుతం ఉత్తర్‌ప్రదేశ్‌లో కాంగ్రెస్‌కు ఇద్దరు ఎమ్మెల్యేలు మాత్రమే ఉన్నారని గుర్తు చేశారు. రెండు పార్టీలు కలిసి పోటీ చేస్తే కాంగ్రెస్‌కు ప్రయోజనం ఉంటుందని అన్నారు. కాంగ్రెస్ మాత్రం 150 సీట్లకు తగ్గకుండా పోటీ చేయాలని ఇప్పటికే తన వైఖరిని స్పష్టం చేసింది. యూపీ కాంగ్రెస్ ఇన్‌ఛార్జి రాజేంద్ర పాల్ గౌతమ్ ఈ విషయాన్ని ఇటీవల ప్రకటించారు. 403 అసెంబ్లీ స్థానాల్లో సగం సీట్లపై తమకు హక్కు ఉందని ఆయన పేర్కొన్నారు. సీట్ల పంపకంపై చర్చలు అక్టోబర్‌లో జరిగే అవకాశం ఉంది. సీట్ల విషయంలో ఏకాభిప్రాయం కుదరకపోతే పొత్తు ఉద్దేశమే దెబ్బతింటుందని పటేల్ అన్నారు. తుది నిర్ణయం ఎస్పీ అధ్యక్షుడు అఖిలేశ్ యాదవ్ తీసుకుంటారని చెప్పారు. కాంగ్రెస్ ఎంపీ ఇమ్రాన్ మసూద్ మాత్రం తమ పార్టీ నాయకత్వం తీసుకునే నిర్ణయానికే కట్టుబడి ఉంటామని తెలిపారు. ఎస్పీ, కాంగ్రెస్ 2024 లోక్‌సభ ఎన్నికల్లో యూపీలో కలిసి పోటీ చేశాయి. ఆ ఎన్నికల్లో ఎస్పీ 37, కాంగ్రెస్ 6 లోక్‌సభ స్థానాలు గెలిచాయి.

## సుప్రీం తీర్పు తర్వాతే మున్సిపల్ ఎన్నికలు

**- బీసీ రిజర్వేషన్లకు ప్రభుత్వం కట్టుబడి ఉంది**
**- పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి నారాయణ**



అమరావతి, అక్టోబర్ 03: స్థానిక సంస్థల ఎన్నికల్లో వెనుకబడిన తరగతులకు (బీసీ) 34 శాతం రిజర్వేషన్లు కల్పించే అంశంపై ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సుప్రీం కోర్టును ఆశ్రయించడం తెలిసిందే. ఈ క్రమంలో రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి నారాయణ స్పందించారు. అమరావతిలో ఈరోజు ఆయన మాట్లాడుతూ, బీసీలకు రిజర్వేషన్లు అమలు చేసేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని, సుప్రీంకోర్టు తీర్పు వెలువడిన తర్వాతే 123 మున్సిపాలిటీలకు ఎన్నికలు నిర్వహిస్తామని స్పష్టం చేశారు. రాబోయే గోదావరి పుష్కరాలను అత్యంత వైభవంగా నిర్వహించేందుకు ప్రభుత్వం సిద్ధమవుతోందని మంత్రి నారాయణ వివరించారు. ఇందుకోసం సుమారు రూ.2,000 కోట్లు కేటాయించామని, ఇందులో ఒక్క రాజమండ్రి అభివృద్ధి పనులకే రూ.1,000 కోట్లు కేటాయించినట్లు పేర్కొన్నారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి సవాలుగా ఉన్నప్పటికీ, పుష్కరాల నిర్వహణకు నిధుల కొరత లేకుండా చూస్తామని హామీ ఇచ్చారు. గతంలో జల్ జీవన్ మిషన్ కింద మంజూరైన రూ.5,350 కోట్ల నిధులు వినియోగించుకోకపోవడంతో నిలిచిపోయిన ప్రాజెక్టులను కేంద్రం సహకారంతో పునరుద్ధరిస్తామని తెలిపారు. అమరావతి అభివృద్ధి పనుల గురించి ప్రస్తావిస్తూ, ప్రపంచంలోని ఐదు ఉత్తమ రాజధానుల్లో ఒకటిగా తీర్చిదిద్దే లక్ష్యంతో పనులు ప్రారంభమయ్యాయని అన్నారు. గత ప్రభుత్వం అమరావతి అభివృద్ధిని పూర్తిగా నిర్వీర్యం చేసిందని విమర్శించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నేతృత్వంలో 2028 చివరి నాటికి నిర్మాణ పనులు పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటున్నట్లు వెల్లడించారు. 2027లో 12 రోజుల పాటు జరగనున్న గోదావరి పుష్కరాలకు లక్షలాదిగా భక్తులు వస్తారని అంచనా వేస్తున్న నేపథ్యంలో రోడ్లు, ఘాట్లు, విద్యుత్ సరఫరా వంటి మౌలిక వసతుల పనులను వివిధ శాఖలు సమన్వయంతో చేపడుతున్నాయి.

## బీసీ రిజర్వేషన్లపై మాట్లాడే హక్కు వైసీపీకి లేదు

వైసీపీపై కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు ఫైర్



అమరావతి, అక్టోబర్ 03 : వైసీపీపై కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. బీసీ రిజర్వేషన్ల అంశంపై మాట్లాడే నైతిక హక్కు వైసీపీకి లేదని ఆయన ధ్వజమెత్తారు. శ్రీకాకుళం జిల్లా పాతపట్నం నియోజకవర్గంలో ఎమ్మెల్యే గోవిందరావుతో కలిసి ‘పల్లె పండుగ 3.0’ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన, పలు అభివృద్ధి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా రామ్మోహన్ నాయుడు మాట్లాడుతూ... బీసీలకు రాజ్యాధికారం దక్కకూడదనే ఉద్దేశంతోనే గతంలో వైసీపీ ప్రభుత్వం రిజర్వేషన్లను అడ్డుకుందని ఆరోపించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీ కోటాపై గతంలో కోర్టు తీర్పు ఇస్తే, దానిపై అప్పటి జగన్ ప్రభుత్వం ఎందుకు పోరాడలేదని ఆయన ప్రశ్నించారు. బీసీలకు వైసీపీ తీవ్ర అన్యాయం చేసిందని మండిపడ్డారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్ల అమలు కోసం సుప్రీంకోర్టులో పోరాటం చేస్తోందని తెలిపారు. గతంలో బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు కల్పించిందే తెలుగుదేశం పార్టీ అని గుర్తుచేశారు. బీసీలు ఉన్నత స్థాయిలో ఉండాలన్నదే టీడీపీ లక్ష్యమని స్పష్టం చేశారు. టీడీపీకి బీసీలే వెన్నెముక అని, తమది బీసీల పార్టీ అని అన్నారు. జగన్ అండ్ కో ఆటలు ఇకపై చెల్లవని హెచ్చరించారు.

# అధికారుల హెచ్చరికను బేకాతర చేస్తున్న బిల్డర్లు.

అభ్యుదయం.మాదాపూర్. అంజయ్య నగర్ లో అతి తక్కువ స్థలంలో అనుమతి లేని అంతస్తులు పేక మేడలా ఒక ప్రక్కకు ఒరిగిపోయిన సంఘటన మరువకముందే, తాజాగా మియాపూర్ న్యూ కాలనీ రోడ్ నెంబర్ 9 లో అనుమతికి మించి అతి తక్కువ స్థలంలో ఐదంతస్తుల నిర్మాణాన్ని నిర్మిస్తున్న బిల్డర్ కు జిహెచ్ఎంసి టౌన్ ప్లానింగ్ సిబ్బంది గత కొన్ని రోజులుగా హెచ్చరికలు చేస్తున్నప్పటికీ హెచ్చరికలను బేఖాతరు చేస్తూ జంకు లేకుండా బరితెగించిన బిల్డర్ నిర్మాణాన్ని పూర్తి దశకు తీసుకురావడం గమనార్హం. ఇప్పటికే నిర్మాణానికి సంబంధించి సదరు బిల్డర్ ఫ్లాట్ లు మొత్తం అమాయకులకు అంటగట్టి సొమ్ము చేసుకున్నట్టు సమాచారం. దీనిపై తక్షణమే టౌన్ ప్లానింగ్ ఉన్నతాధికారులు స్పందించి అనుమతికి మించి నిర్మించిన నిర్మాణంపై చర్యలు తీసుకోవాలని నిర్మాణానికి ఇరుపక్కల ఉన్న ఇంటి యజమానులు డిమాండ్ చేస్తున్నారు. దీనిపై గత వారంలో అభ్యుదయం పత్రికలో వచ్చిన వార్తను మాదాపూర్ జి.హెచ్.ఎం.సి డిప్యూటీ కమిషనర్ దృష్టికి తీసుకువెళ్లడం జరిగింది. ఇంతవరకు ఆ నిర్మాణం పై ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం వెనుక కారణాలేంటో అధికారులకే తెలియాలి. ఇప్పటికైనా మాదాపూర్ సర్కిల్





50 జి.హెచ్.ఎం.సి డిప్యూటీ కమిషనర్ తక్షణమే స్పందించి అక్రమ నిర్మాణం పై చర్యలు తీసుకోవాలని కాలనీవాసులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

# అనుమతులు కొద్దే.. అంతస్తులు ఎన్నో!

## ● అధికారుల కళ్ల ముందే అక్రమ నిర్మాణమా?

## ● సర్కిల్--51 అల్విన్ కాలనీలో నిర్మాణంపై అనేక ప్రశ్నలు.. విద్యుత్, నీటి కనెక్షన్లపైనా సందేహాలు.





భాగ్యనగర్ కాలనీ ఫేజ్--3లో నిర్మాణంలో ఉన్న భవనం. అనుమతులు, అదనపు అంతస్తులు, హైటెన్షన్ విద్యుత్ లైన్ల సమీపం, ఫైర్ సేఫ్టీ అంశాలపై అధికారుల సమగ్ర తనిఖీ అవసరం

అభ్యుదయం - కూకట్ పల్లి (అక్టోబర్ 03): కుకట్‌పల్లి జోన్‌లోని అల్విన్ కాలనీ సర్కిల్--51 పరిధిలో, గూర్రం జాషువా వీధి, భాగ్యనగర్ కాలనీ ఫేజ్--3లో, ఎంఎన్‌ఆర్ స్కూల్ ఎదురుగా ఉన్న ఒక నిర్మాణంపై అనుమతులకు మించి అంతస్తులు నిర్మిస్తున్నారన్న ఆరోపణలు స్థానికంగా చర్చనీయాంశంగా మారాయి. నిర్మాణ అనుమతులు, అదనపు అంతస్తులు, విద్యుత్--నీటి కనెక్షన్లు, హైటెన్షన్ విద్యుత్ లైన్ల సమీపం వంటి అంశాలపై సమగ్ర తనిఖీ అవసరమని స్థానికులు కోరుతున్నారు.

ముఖ్యాంశాలు

ప్లాట్ నంబర్లు 184 పార్ట్, 183 పార్ట్, ప్లాట్ నంబర్ 183. ప్రాంతంలో జరుగుతున్న నిర్మాణంపై అనుమతులు, అంతస్తుల సంఖ్య, సెట్‌బ్యాక్‌లను అధికారులు పరిశీలించాల్సిన అవసరం ఉంది.

నిర్మాణ స్థలం హైటెన్షన్ విద్యుత్ లైన్లకు సమీపంలో ఉందని స్థానికుల ఆందోళన. అగ్నిప్రమాదం జరిగితే అగ్నిమాపక వాహనాల రాకపోకలు, రెస్క్యూ చర్యలకు ఎదురయ్యే అడ్డంకులపై భద్రతా తనిఖీ అవసరం.

ప్రజల నివాస ప్రాంతంలోనే.. నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణమా?

సైబరాబాద్ మునిసిపల్ కార్పొరేషన్ పరిధిలోని

కుకట్‌పల్లి జోన్ అల్విన్ కాలనీ సర్కిల్--51 పరిధిలో గూర్రం జాషువా వీధి, భాగ్యనగర్ కాలనీ ఫేజ్--3, ఎంఎన్‌ఆర్ స్కూల్ ఎదురుగా ఉన్న నిర్మాణంపై స్థానికంగా పలు ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

స్థానికుల సమాచారం ప్రకారం ప్లాట్ నంబర్లు 184 పార్ట్, 183 పార్ట్, ప్లాట్ నంబర్ 183 పరిధిలో నిర్మాణం జరుగుతున్నట్లు చెబుతున్నారు. ఈ నిర్మాణానికి మంజూరైన అనుమతులు ఏమిటి? అనుమతించిన అంతస్తుల సంఖ్య ఎంత? ప్రస్తుతం నిర్మించిన అంతస్తులు అనుమతులకు అనుగుణంగానే ఉన్నాయా? అనే అంశాలను సంబంధిత మున్సిపల్ అధికారులు ప్రత్యక్షంగా పరిశీలించాల్సిన అవసరం ఉంది.

### అధికారుల పర్యవేక్షణ ఎక్కడ?

ఒక భవనం అనుమతులకు అనుగుణంగా నిర్మించబడుతోందా లేదా అనేది నిర్మాణ దశలోనే గుర్తించడం మున్సిపల్ యంత్రాంగానికి ముఖ్యమైన బాధ్యత. అనుమతులకు మించి అంతస్తులు నిర్మిస్తే, సంబంధిత అధికారులు నిబంధనల ప్రకారం తనిఖీ చేసి అవసరమైన చర్యలు తీసుకోవాల్సి ఉంటుంది.

అయితే ఈ నిర్మాణం విషయంలో నిర్మాణ దశలో అధికారుల తనిఖీలు జరిగాయా? జరిగితే ఏమి గుర్తించారు? ఏమైనా నోటీసులు జారీ చేశారా? అనే ప్రశ్నలు స్థానికుల్లో వినిపిస్తున్నాయి.

నిర్మాణం పూర్తయ్యే వరకు వేచి చూసి తరువాత చర్యలు తీసుకోవడం కంటే.. నిబంధనల ఉల్లంఘన ఉంటే నిర్మాణ దశలోనే అడ్డుకోవడం అవసరం అని స్థానికులు అంటున్నారు.

విద్యుత్, నీటి కనెక్షన్లు ఎలా వచ్చాయి?

అక్రమంగా నిర్మించారని ఆరోపణలు ఎదుర్కొంటున్న అదనపు అంతస్తులకు విద్యుత్, నీటి సౌకర్యాలు ఉన్నట్లయితే, అవి ఏ పత్రాల ఆధారంగా మంజూరయ్యాయన్నది కూడా పరిశీలించాల్సిన అంశమే.

సంబంధిత విద్యుత్ శాఖ అధికారులు:

కనెక్షన్ కోసం ఏ పత్రాలు స్వీకరించారు?

భవన అనుమతులకు సంబంధించిన వివరాలు పరిశీలించారా?

నిర్మాణంలో ఉన్న/పూర్తయిన అంతస్తుల వివరాలు ధృవీకరించారా?

అనే ప్రశ్నలకు సమాధానం ఇవ్వాల్సి ఉంటుంది.

అదేవిధంగా నీటి సరఫరా కనెక్షన్ మంజూరులో కూడా సంబంధిత భవన పత్రాలను ఏ స్థాయిలో పరిశీలించారన్నది స్పష్టం చేయాల్సిన అవసరం ఉంది.

విద్యుత్ లేదా నీటి కనెక్షన్ ఉన్నంత మాత్రాన ఆ నిర్మాణంలోని ప్రతి అంతస్తుకు మున్సిపల్ అనుమతి ఉందని భావించలేం. అందువల్ల సంబంధిత రికార్డులను అధికారులు పరిశీలించాలి.

హైటెన్షన్ లైన్లకు అత్యంత సమీపంలో నిర్మాణం?

ఈ వ్యవహారంలో మరింత కీలకమైన అంశం నిర్మాణ స్థలానికి సమీపంలో హైటెన్షన్ విద్యుత్ లైన్లు - స్థానికుల ఆందోళన.

ఎత్తైన భవనం, విద్యుత్ లైన్ల మధ్య సురక్షిత దూరం, నిర్మాణ సమయంలో పాటించాల్సిన భద్రతా ప్రమాణాలు, అత్యవసర పరిస్థితుల్లో రెస్క్యూ వాహనాలు చేరుకునే మార్గం వంటి అంశాలను సంబంధిత అధికారులు సాంకేతికంగా పరిశీలించాల్సి ఉంటుంది.

ముఖ్యంగా ఈ భవనంలోని పై అంతస్తుల్లో అగ్నిప్రమాదం సంభవించిన పరిస్థితిలో ఫైర్ ఇంజిన్లు సంఘటనా స్థలానికి ఎంతవరకు చేరుకోగలవు? అగ్నిమాపక సిబ్బంది రెస్క్యూ చర్యలు చేపట్టేందుకు అవసరమైన మార్గం ఉందా? హైటెన్షన్ లైన్ల సమీపం వల్ల అత్యవసర చర్యలకు అదనపు ప్రమాదం ఏర్పడుతుందా? అనే అంశాలపై ఫైర్ సేఫ్టీ, విద్యుత్ మరియు మున్సిపల్ అధికారులు సంయుక్తంగా పరిశీలన చేయాల్సిన అవసరం ఉంది.

“ప్రమాదం జరిగితే చూస్తాం” అనే విధానం కాకుండా.. ప్రమాదం జరగకముందే భద్రతా లోపాలను గుర్తించి చర్యలు తీసుకోవడం అవసరం.

### అగ్నిప్రమాదం జరిగితే బాధ్యత ఎవరిది?

భవనంలో అదనపు అంతస్తులు అనుమతులకు విరుద్ధంగా ఉన్నాయా లేదా అన్నది అధికారిక తనిఖీ ద్వారా తేలాలి. అయితే భవనం ఎత్తు పెరిగే కొద్దీ అత్యవసర పరిస్థితుల్లో రక్షణ చర్యల ప్రణాళిక కూడా అంతే ముఖ్యమవుతుంది.

రోడ్డు వెడల్పు, భవనం చుట్టూ ఖాళీ స్థలం, ఫైర్ ఇంజిన్ ప్రవేశించే అవకాశం, మెట్ల మార్గాలు, ఫైర్ సేఫ్టీ పరికరాలు, విద్యుత్ లైన్లకు భవనం దూరం వంటి అంశాలను సంబంధిత విభాగాలు పరిశీలించాల్సి ఉంటుంది.

అనుమతుల ఉల్లంఘన ఉంటే ఒకవైపు మున్సిపల్ నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవడంతో పాటు, ప్రజల ప్రాణ భద్రతకు సంబంధించిన ఫైర్ సేఫ్టీ అంశాలపైనా తక్షణ పరిశీలన అవసరం.

అధికారులకు అభ్యుదయం సూటి ప్రశ్నలు

1. ప్లాట్ నంబర్లు 184 పార్ట్, 183 పార్ట్, ప్లాట్ నెంబర్ 183కు సంబంధించిన నిర్మాణ అనుమతులు ఏమిటి? ప్రస్తుతం ఉన్న అంతస్తుల సంఖ్యకు అధికారిక అనుమతి ఉందా?
2. నిర్మాణం జరుగుతున్న సమయంలో అల్విన్ కాలనీ సర్కిల్--51 మున్సిపల్ అధికారులు ఎన్ని సార్లు తనిఖీ చేశారు? తనిఖీ నివేదికలు ఏమంటున్నాయి?
3. అనుమతులకు మించి నిర్మాణం ఉంటే ఇప్పటివరకు ఎలాంటి నోటీసులు లేదా చర్యలు తీసుకున్నారు?
4. సంబంధిత నిర్మాణానికి విద్యుత్, నీటి కనెక్షన్లు ఏ పత్రాల ఆధారంగా మంజూరయ్యాయి?
5. హైటెన్షన్ విద్యుత్ లైన్లకు సమీపంలో ఉన్న ఈ నిర్మాణంపై విద్యుత్ భద్రతా పరిశీలన జరిగిందా?
6. అగ్నిప్రమాదం సంభవించినప్పుడు ఫైర్ ఇంజిన్ భవనం వద్దకు చేరుకుని పై అంతస్తులకు సహాయక చర్యలు చేపట్టేందుకు తగిన స్థలం, మార్గం ఉందా?

### ప్రజల ప్రాణ భద్రతపై రాజీ వద్దు

అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోవడం కేవలం భవన నిబంధనల అమలుకు సంబంధించిన అంశం మాత్రమే కాదు. అక్కడ నివసించే కుటుంబాల ప్రాణ భద్రతకు సంబంధించిన అంశం కూడా.

అందువల్ల అల్విన్ కాలనీ సర్కిల్--51 అధికారులు ఈ నిర్మాణంపై అనుమతులు, నిర్మాణ విస్తీర్ణం, అంతస్తుల సంఖ్య, సెట్‌బ్యాక్‌లు, ఫైర్ సేఫ్టీ, విద్యుత్ లైన్లకు దూరం తదితర అంశాలపై సమగ్ర తనిఖీ నిర్వహించి వాస్తవాలను వెల్లడించాల్సిన అవసరం ఉంది.

అదే సమయంలో విద్యుత్, నీటి సరఫరా విభాగాలు కూడా సంబంధిత కనెక్షన్ల మంజూరు ప్రక్రియను పరిశీలించి, నిబంధనలకు అనుగుణంగానే కనెక్షన్లు ఇచ్చామా? అనే విషయాన్ని స్పష్టం చేయాలి.

నిర్మాణం పూర్తయ్యాక చర్యల కంటే.. ప్రమాదం జరగకముందే తనిఖీ చేసి ప్రజలను రక్షించడం ముఖ్యం.

స్థల వివరాలు

ప్రాంతం: గూర్రం జాషువా వీధి, భాగ్యనగర్ కాలనీ ఫేజ్--3ల్యాండ్‌మార్క్: ఎంఎన్‌ఆర్ స్కూల్ ఎదురుగా

ప్లాట్ నంబర్లు: 184 పార్ట్, 183 పార్ట్, 183 ---

పరిధి: అల్విన్ కాలనీ సర్కిల్--51, కుకట్‌పల్లి జోన్.

# పార్లమెంటరీ కమిటీల్లో తెలంగాణ ఎంపీలకు ప్రాధాన్యం



న్యూఢిల్లీ, అక్టోబరు 3 పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీల్లో తెలంగాణ ఎంపీలకు ప్రాధాన్యం దక్కింది. విదేశీ వ్యవహారాల కమిటీలో కె.లక్ష్మణ్, డీకే అరుణ, అసదుద్దీన్ ఒవైసీ; గృహ, పట్టణ వ్యవహారాల కమిటీలో చామల కిరణ్‌కుమార్‌రెడ్డి; వాణిజ్య వ్యవహారాల కమిటీలో రేణుకా చౌదరి; ఆరోగ్య, కుటుంబ సంక్షేమ కమిటీలో బి.పార్థసారథిరెడ్డి, కడియం కావ్య; పరిశ్రమల కమిటీలో ధర్మపురి అర్వింద్, మల్లు రవి, కొండా విశ్వేశ్వర్‌రెడ్డి ఉన్నారు. సిబ్బంది, ప్రజాఫిర్యాదులు, చట్టం, న్యాయ కమిటీలో ఎం.రఘునందన్‌రావు; సైన్స్, టెక్నాలజీ, పర్యావరణం, వాతావరణ మార్పుల కమిటీలో గడ్డం వంశీకృష్ణ; రవాణా, పర్యాటకం, సాంస్కృతిక కమిటీలో సురేశ్‌కుమార్ షెట్కార్; రసాయనాలు, ఎరువుల కమిటీలో పోరిక బలరాం నాయక్, ఈటల రాజేందర్ సభ్యులుగా ఉన్నారు.

ఇక బొగ్గు, గనులు, ఉక్కు కమిటీలో అనిల్‌కుమార్ యాదవ్; సమాచార ప్రసార, సమాచార సాంకేతిక కమిటీలో రఘురామిరెడ్డి; ఆహారం, ప్రజాపంపిణీ కమిటీలో ఆర్.కృష్ణయ్య; రక్షణ కమిటీలో దామోదర్‌రావుకు చోటు దక్కింది. ఇంధన కమిటీలో వేంనరేందర్‌రెడ్డి, రఘువీర్‌రెడ్డి; సామాజిక న్యాయం, సాధికారత కమిటీలో గోడెం నగేశ్, పెట్రోలియం, సహజవాయువు కమిటీలో వద్దిరాజు రవిచంద్ర సభ్యులుగా నియమితులయ్యారు

# రక్త పరీక్షలు చేయట్లే..

## టీ-డయాగ్నోస్టిక్స్ ఆగమాగం..

## రీఏజెంట్స్ లేక నిలిచిన టెస్టులు



హైదరాబాద్, అక్టోబర్ 3 పేదలకు ఉచితంగా వైద్యపరీక్షలు అందించాలనే సదుద్దేశంతో బీఆర్ఎస్ హయాంలో 2018లో ప్రవేశపెట్టిన టీ-డయాగ్నోస్టిక్స్‌పై కాంగ్రెస్ సర్కార్ నిర్లక్ష్యం వహిస్తున్నది. రాష్ట్రవ్యాప్తంగా అన్ని ప్రభుత్వ దవాఖానల్లో రీఏజెంట్స్ కొరత కారణంగా ప్రధాన టెస్టులు నిలిచిపోయినట్టు తెలుస్తున్నది.ప్రభు త్వ దవాఖానల్లో బ్లడ్‌షుగర్ లెవల్స్ కోసం నిర్వహించే హెచ్‌బీఏ1సీ(గ్లైకేటెడ్ హిమోగ్లోబిన్) మెగ్నీషియం టెస్ట్, సీరమ్ క్రియాటినిన్, టోటల్ ఐరన్-బైండింగ్ కెపాసిటీ(టీఐబీసీ), సీ-రీయాక్టివ్ ప్రొటీన్ (సీఆర్పీ) తదితర పరీక్షలు పూర్తిగా నిలిచిపోయినట్టు తెలిసింది. దవాఖానల్లో వైద్యపరీక్షలు నిర్వహించాలంటే రీఏజెంట్స్ తప్పనిసరి.

రీఏజెంట్స్ సరఫరా చేసిన ఏజెన్సీలకు రాష్ట్ర ప్రభుత్వం రూ.400 కోట్ల వరకు బిల్లులు చెల్లించాల్సి ఉన్నట్టు సమాచారం. చెల్లింపులో జాప్యం చేయడంతో ఏజెన్సీలు సరఫరా నిలిపివేసినట్టు తెలిసింది. దీంతో ప్రభుత్వ దవాఖానల్లో మూడు నెలలకుపైగా వైద్య పరీక్షలు నిలిచిపోయాయి. దీంతో రోగులు ప్రైవేట్ డయాగ్నస్టిక్ సెంటర్లను ఆశ్రయిస్తున్నారు.

నాడు కేసీఆర్ దూరదృష్టితో..

ప్రభుత్వ దవాఖానలకు వచ్చే పేద, మధ్య తరగతి ప్రజలకు వైద్య పరీక్షలు ఆర్థిక భారం కాకూడదనే ఉద్దేశంతో నాడు కేసీఆర్ టీ-డయాగ్నోస్టిక్స్‌ను ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టారు. హైదరాబాద్ నారాయణగూడలోని ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ప్రివెంటివ్ మెడిసిన్ ప్రధాన హబ్‌గా టీ-డయాగ్నోస్టిక్స్ ఏర్పాటు చేసింది. అనంతరం రాష్ట్రవ్యాప్తంగా విస్తరించింది. 32 మైక్రోబయోలజీ, పాథాలజీ, బయోకెమిస్ట్రీ ల్యాబ్స్‌తో కూడిన హబ్స్‌ను ఏర్పాటు చేసింది. పీహెచ్‌సీలు, బస్తీ, పల్లె దవాఖానలు, కమ్యూనిటీ సెంటర్లలో 1,546 చోట్ల స్పోక్స్(చిన్న కేంద్రాలు) నెలకొల్పింది. ఫలితాలు వెంటనే వచ్చే టెస్టులను స్పోక్స్‌లలో, సమయం పట్టేవి హబ్‌లలో నిర్వహించేలా చర్యలు చేపట్టింది.




# కొన్ని విషయాలు మనతోనే ఉండాలి

వెస్టిండీస్‌తో జరిగిన రెండో వన్డేలో అద్భుత శతకంతో మెరిసిన భారత కెప్టెన్ రోహిత్ శర్మ చేసిన ప్రత్యేక సంబరాలు ఇప్పుడు నెట్టింట వైరల్‌గా మారాయి. సెంచరీ పూర్తయ్యాక సాధారణంగా బ్యాట్ పైకెత్తే క్రికెటర్లకు భిన్నంగా.. హిట్‌మ్యాన్ హై-నీ జాగింగ్ తరహాలో వినూత్నంగా అడుగులు వేస్తూ సంబరాలు చేసుకున్నాడు. ఈ డిఫరెంట్ సెలబ్రేషన్ వెనుక ఉన్న రహస్యమేంటని అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తుండగా, రోహిత్ స్పందిస్తూ.. "కొన్ని విషయాలు మనతోనే ఉండాలి, ప్రతీదీ బయటకు చెప్పాల్సిన అవసరం లేదు" అని వ్యాఖ్యానించడం విశేషం. ఈ మ్యాచ్‌లో వెస్టిండీస్ విధించిన 406 పరుగుల భారీ లక్ష్యాన్ని ఛేదించడంలో రోహిత్ శర్మ (75 బంతుల్లో 101) కీలక పాత్ర పోషించాడు. యువ ఓపెనర్ శుభ్‌మన్ గిల్ (223 నాటౌట్)తో కలిసి తొలి వికెట్‌కు ఏకంగా 255 పరుగుల భారీ భాగస్వామ్యాన్ని నెలకొల్పాడు. ఈ క్రమంలోనే రోహిత్ తన వన్డే కెరీర్‌లో 35వ శతకాన్ని పూర్తి చేసుకున్నాడు. మ్యాచ్ ముగిసిన తర్వాత తన వైరల్ సెలబ్రేషన్ గురించి రోహిత్ మాట్లాడుతూ, అది తన వ్యక్తిగత విషయమని స్పష్టం చేశాడు. మైదానంలోనే ఉన్న రవీంద్ర జడేజా కూడా ఈ సంబరం వెనుక ఉన్న కారణాన్ని అడగ్గా, డ్రెస్సింగ్ రూమ్‌కి వచ్చాక చెబుతానని దాటవేసినట్లు రోహిత్ తెలిపాడు.

అయితే డైవ్ చేస్తూ, గాల్లోకి ఎగురుతూ జెట్ స్పీడ్‌లో సంబరాలు చేసుకోవాలని జడేజా సలహా ఇచ్చాడని, కానీ 50 ఓవర్లు ఫీల్డింగ్ చేసి, మరో 30 ఓవర్లు బ్యాటింగ్ చేసిన తనకు అంత శక్తి లేదని సరదాగా సమాధానమిచ్చానని రోహిత్ పేర్కొన్నాడు. భారీ ఛేదనలో స్కోరుబోర్డు ఒత్తిడిని పక్కనపెట్టి కేవలం భాగస్వామ్యంపైనే దృష్టి పెట్టామని రోహిత్ వెల్లడించాడు. ఆఖరి వరకు నిలబడి డబుల్ సెంచరీతో జట్టును గెలిపించిన గిల్‌పై ప్రశంసల జల్లు కురిపించాడు.

# చివరి వన్డేలో టీమిండియా కీలక మార్పులు



భారతదేశం వేదికగా జరుగుతున్న భారత్, వెస్టిండీస్ మధ్య మూడు మ్యాచ్‌ల వన్డే సిరీస్‌లో ఆఖరి పోరుకు రంగం సిద్ధమైంది. ఇప్పటికే తొలి రెండు మ్యాచ్‌లలో ఘన విజయాలు సాధించిన టీమిండియా 2-0 తేడాతో అజేయమైన ఆధిక్యాన్ని దక్కించుకుంది. ఇప్పుడు ఆదివారం జరగనున్న మూడో అలాగే చివరి వన్డేలో వెస్టిండీస్‌ను క్లీన్ స్వీప్ చేయాలని పట్టుదలగా ఉంది. అదే సమయంలో ఇప్పటివరకు తుది జట్టులో ఆడే అవకాశం రాని రిజర్వ్ బెంచ్ ఆటగాళ్లను మైదానంలోకి దించి వారి ప్రతిభను పరీక్షించాలని టీమ్ మేనేజ్‌మెంట్ భావిస్తోంది. మహారాజా యదవీంద్ర సింగ్ అంతర్జాతీయ క్రికెట్ స్టేడియంలో ఈ మ్యాచ్ జరగనుంది. గౌహతిలో జరిగిన రెండో వన్డేలో భారత్ అద్భుతమైన ప్రదర్శన చేసి 8 వికెట్ల తేడాతో విజయం సాధించింది. ఆ మ్యాచ్‌లో కెప్టెన్ శుభమన్ గిల్ అజేయంగా 223 పరుగులు చేయగా, రోహిత్ శర్మ 101 పరుగులతో రాణించారు. అయితే ఈ సిరీస్‌లో బ్యాటింగ్‌కు అనుకూలంగా పిచ్‌లు మారుతుండటంపై విమర్శలు వస్తున్నాయి. గత మ్యాచ్‌లో రెండు జట్లు కలిసి ఏకంగా 800లకు పైగా పరుగులు సాధించడం విశేషం. భారత్ ప్రధాన కోచ్ గౌతం గంభీర్ సైతం బ్యాట్, బాల్ మధ్య సరైన బ్యాలెన్సింగ్ ఉండాలని అభిప్రాయ పడ్డారు. ముఖ్యంగా భారత బౌలర్లు మిగతా ఓవర్లలో వికెట్లు తీయడానికి కాస్త ఇబ్బంది పడుతుండటం ఆందోళన కలిగిస్తోంది. సిరీస్ ఇప్పటికే మనవశం కావడంతో మేనేజ్‌మెంట్ తుది జట్టులో కొన్ని ప్రయోగాలు చేయడానికి ఇది సరైన సమయంగా భావిస్తోంది. రుతురాజ్ గైక్వాడ్, కేఎల్ రాహుల్, నితీశ్ కుమార్ రెడ్డి, మొహమ్మద్ సిరాజ్ వంటి ఆటగాళ్లకు తుది జట్టులో చోటు దక్కే అవకాశం ఉంది. తొలి రెండు మ్యాచ్‌లలో ఓపెనర్లు రోహిత్, గిల్‌తో పాటు కోహ్లీ కూడా అద్భుతంగా రాణించారు. స్క్వాడ్‌లో మొత్తం 15 మంది ఆటగాళు ఉండగా, కేవలం బెంచ్‌కే పరిమితమైన వారికి ఆడే సమయం లభిస్తుంది.

అయితే గత మ్యాచ్‌లో ఎడమ కాలి హ్యామ్‌స్ట్రింగ్ గాయం కారణంగా ప్రసిద్ధ్ కృష్ణ చివరి మ్యాచ్‌కు దూరమయ్యాడు. అతని స్థానంలో అన్షుల్ కంబోజ్ జట్టులోకి వచ్చాడు. భారత పేస్ బౌలింగ్ విభాగంలో యువ ఆటగాళ్ల మధ్య గట్టి పోటీ నెలకొంది. తొలి రెండు మ్యాచ్‌లలో ఆడే అవకాశం రాని స్థానిక పేసర్ మొహమ్మద్ సిరాజ్ తుది జట్టులోకి తిరిగి వచ్చే ఛాన్స్ ఉంది. శ్రీలంక పర్యటన తర్వాత సిరాజ్ తన అత్యుత్తమ లయను అందుకోవడానికి తీవ్రంగా శ్రమిస్తున్నాడు. గురునూర్ బ్రార్, ఆకిబ్ నబీ వంటి యువ సంచలనాలు కూడా అవకాశాల కోసం ఎదురుచూస్తున్నాయి. ఈ ఏడాది చివరిలో న్యూజిలాండ్‌తో జరగబోయే ఐదు మ్యాచ్‌ల సిరీస్‌కు ముందు, ఈ ఆఖరి వన్డే యువ బౌలర్లకు తమ సత్తా నిరూపించుకోవడానికి గొప్ప వేదిక కానుంది. ముల్లాంపూర్ వేదికగా పురుషుల వన్డే మ్యాచ్ జరగడం ఇదే మొదటిసారి. ఇక్కడి పిచ్ బౌలర్లకు కొంత వరకు సహకరిస్తుందని భావిస్తున్నారు. సిరీస్ కోల్పోయినప్పటికీ, వెస్టిండీస్ జట్టు తమ బ్యాటింగ్‌తో ఆకట్టుకుంది. గత మ్యాచ్‌లో ఆ జట్టు 405 పరుగులు సాధించి సంచలనం సృష్టించింది. జాన్ క్యాంప్‌బెల్, షై హోప్, అమీర్ జాంగూ సెంచరీలతో అదరగొట్టారు. భారత్ చేతిలో ఓడిపోయినప్పటికీ, తమ బ్యాటింగ్ వైఫల్యాలను సరిదిద్దుకొని ఈ ఆఖరి మ్యాచ్‌లో విజయం సాధించి పరువు నిలుపుకోవాలని కరీబియన్ జట్టు భావిస్తోంది.

# భారత్ ఏ అసాధారణ పోరాటం..

**ఆస్ట్రేలియా ఏ జట్టుతో రెండో టెస్టు ఉత్కంఠభరిత డ్రా-1-0 తేడాతో సిరీస్‌ను కైవసం చేసుకున్న భారత్ ఏ జట్టు**



భారత్ ఏ, ఆస్ట్రేలియా ఏ జట్ల మధ్య జరిగిన రెండో అనధికారిక టెస్టు మ్యాచ్ థ్రిల్లర్‌ను తలపించింది. చివరి రోజు అసాధారణ పోరాటపటిమ కనబరిచిన యశ్ రాథోడ్, షామ్స్ ములానీ గట్టి పట్టుదలతో క్రీజులో నిలబడి మ్యాచ్‌ను డ్రాగా ముగించారు. దీంతో రెండు మ్యాచ్‌ల సిరీస్‌ను భారత్ ఏ 1-0 తేడాతో కైవసం చేసుకుంది. తొలి టెస్టులో 162 పరుగుల తేడాతో విజయం సాధించిన భారత్, ఈ మ్యాచ్‌ను డ్రా చేసుకోవడంతో సిరీస్ విజేతగా నిలిచింది. శుక్రవారం, నాలుగో రోజు ఆటలో 365 పరుగుల భారీ లక్ష్య ఛేదనకు దిగిన భారత్ ఏ, ఆట ముగిసే సమయానికి 103 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 310 పరుగులు చేసింది. విజయానికి 55 పరుగుల దూరంలో నిలిచినప్పటికీ, ఆసీస్ బౌలర్ల నిరంతర దాడిని తట్టుకుని ఓటమిని తప్పించుకోవడంలో సఫలమైంది. నైట్‌వాచ్‌మన్‌గా వచ్చిన తుషార్ దేశ్‌పాండే (52), యశ్ రాథోడ్ (80) హాఫ్ సెంచరీలతో కీలక పాత్ర పోషించగా, ప్లేయర్ ఆఫ్ ది సిరీస్‌గా నిలిచిన షామ్స్ ములానీ (131 బంతుల్లో 26) అద్భుతమైన డిఫెన్స్‌తో మ్యాచ్‌ను కాపాడాడు. నాలుగో రోజు ఆట ప్రారంభంలోనే భారత్ ఏ పై ఒత్తిడి పెరిగింది. అయితే నైట్‌వాచ్‌మన్ తుషార్ దేశ్‌పాండే సుమారు 180 నిమిషాల పాటు క్రీజులో నిలబడి ఆసీస్ బౌలర్లను సమర్థంగా ఎదుర్కొన్నాడు. కెప్టెన్ దేవదత్ పడిక్కల్ (26)తో కలిసి 60 పరుగుల కీలక భాగస్వామ్యాన్ని నెలకొల్పాడు. అయితే లంచ్ తర్వాత ఆసీస్ బౌలర్ లియామ్ స్కాట్ (5/52) తన పదునైన బౌలింగ్‌తో మ్యాచ్‌ను మలుపు తిప్పాడు. వైవిధ్యభరిత బౌన్స్‌తో ఇబ్బంది పెడుతూ పడిక్కల్, దేశ్‌పాండేలతో పాటు తొలి మ్యాచ్ సెంచరీ హీరో కుమార్ కుశాగ్రను కూడా పెవిలియన్ చేర్చాడు. దీంతో భారత్ ఏ 199 పరుగులకే 7 వికెట్లు కోల్పోయి పీకల్లోతు కష్టాల్లో పడింది. ఈ క్లిష్ట దశలో యశ్ రాథోడ్, షామ్స్ ములానీ జతకలిశారు. ఓటమి అంచున ఉన్న జట్టును గట్టెక్కించడానికి వీరోచితంగా పోరాడారు. వీరిద్దరూ ఎనిమిదో వికెట్‌కు 131 బంతులు ఎదుర్కొని 85 పరుగుల అమూల్యమైన భాగస్వామ్యాన్ని నెలకొల్పారు. మ్యాచ్ డ్రా దిశగా సాగుతున్న దశలో లియామ్ స్కాట్ మళ్లీ చెలరేగాడు. మొదట రాథోడ్‌ను, ఆ తర్వాత ములానీని ఎల్బీడబ్ల్యూగా ఔట్ చేసి ఉత్కంఠను తారాస్థాయికి చేర్చాడు. చివరి మూడు ఓవర్లు మిగిలి ఉండగా భారత్ చేతిలో ఒక్క వికెట్ మాత్రమే ఉంది.

# హార్దిక్ లేకుండా 2027 వన్డే ప్రపంచకప్ గెలవడం కష్టం

**మాజీ కెప్టెన్ సౌరవ్ గంగూలీ సూచన**

వన్డే ప్రపంచకప్ 2027 టోర్నీలో భారత్ విజయం సాధించాలంటే ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్యా ఉండటం కీలకమని మాజీ కెప్టెన్ సౌరవ్ గంగూలీ అన్నాడు. అతను ఉంటే జట్టు సమతూకంగా ఉంటుందని అభిప్రాయపడ్డాడు. హార్దిక్ పాండ్యా పూర్తిగా ఫిట్‌గా ఉంచి, ప్రపంచకప్‌కు సిద్ధం చేయడం హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్ ముందున్న అతి పెద్ద సవాల్ అని చెప్పుకొచ్చాడు.ఐసీసీ వన్డే ప్రపంచకప్ 2027 షెడ్యూల్‌ను ఐసీసీ గురువారం ప్రకటించింది. అక్టోబర్ 2 నుంచి నవంబర్ 21 వరకు సౌతాఫ్రికా, జింబాబ్వే, నమీబియాలో జరగనుంది. తొలి మ్యాచ్‌లోనే డిఫెండింగ్ ఛాంపియన్‌తో భారత్ తలపడనుంది. హార్దిక్ పాండ్యా ఇప్పటికే 2019, 2023 ప్రపంచకప్‌లు ఆడాడు. 2023లో బంగ్లాదేశ్‌తో మ్యాచ్ సందర్భంగా చీలమండ గాయం కావడంతో టోర్నీకి దూరమయ్యాడు. అతని గైర్హాజరీ టీమిండియా విజయవకాశాలను దెబ్బతీసింది. తాజాగా మెగా టోర్నీ గురించి మాట్లాడిన గంగూలీ.. హార్దిక్ పాండ్యా అవసరాన్ని నొక్కి చెప్పాడు. 'ప్రపంచకప్‌లో టీమిండియా కాంబినేషన్‌కు హార్దిక్ పాండ్యా చాలా ముఖ్యం. అతన్ని మైదానంలో ఫిట్‌గా ఉంచడం గంభీర్ ముందున్న అతి పెద్ద సవాల్. ప్రస్తుతం అతను తగినంత క్రికెట్ ఆడటం లేదు. ఒకవేళ హార్దిక్ పాండ్యా అందుబాటులో లేకపోతే నితీష్ రెడ్డి ప్రత్యామ్నాయం అవుతాడు. కానీ నితీశ్‌ను హార్దిక్‌కు ప్రత్యామ్నాయంగా చూడాలంటే అప్పటివరకు అతను నిలకడగా క్రికెట్ ఆడాలి. ఆ స్థాయిలో ప్రదర్శన చేయాలి.'అని సౌరవ్ గంగూలీ జియో హాట్‌స్టార్‌తో అన్నాడు. 'రవీంద్ర జడేజా కూడా మరో ప్రత్యామ్నా యం. కానీ సౌతాఫ్రికా కండిషన్స్‌లో స్పిన్ కంటే పేస్ ఆల్‌రౌండర్ అవసరం ఉంటుంది. భారత టాప్-5 బ్యాటర్లలో ఎవరూ బౌలింగ్ చేయరు కాబట్టి. భారత్‌కు ఎక్స్‌ట్రా బౌలింగ్ ఆప్షన్ కావాలంటే ఆల్‌రౌండర్‌ను ఆడించాల్సిందే. తొలి మ్యాచ్‌లోనే భారత్ బలమైన ప్రత్యర్థిని ఎదుర్కోవడం మంచిదే. సెకండాఫ్‌లో సౌతాఫ్రికాతో జరిగే మ్యాచ్ కోసం నేను ఆసక్తిగా ఎదురుచూస్తున్నాను. సొంత గడ్డపై




జరిగే ప్రపంచకప్‌కు సౌతాఫ్రికా బలమైన జట్టుతో బరిలోకి దిగుతోంది.'అని గంగూలీ చెప్పుకొచ్చాడు. భారత మాజీ వికెట్‌కీపర్ పార్థివ్ పటేల్ కూడా షెడ్యూల్‌పై స్పందించాడు. ఆరంభంలోనే రెండు కఠినమైన మ్యాచ్‌లు ఆడటం ద్వారా టీమిండియా కాంబినేషన్‌ను పరీక్షించుకోవచ్చని, కీలక ఆటగాళ్ల ఫిట్‌నెస్, ఫామ్, వర్క్‌లోడ్‌ను అవసరానికి తగ్గట్టు చూసుకొవచ్చని చెప్పాడు. ఈ ఫార్మాట్ పాకిస్థాన్‌కు బాగా నచ్చుతందని, కనీసం సూపర్ 7 చేరవచ్చని ఆ జట్టు భావిస్తుందని సెటైర్లు పేల్చాడు.

# రిటైర్మెంట్ ప్రకటించిన యుజ్వేంద్ర చాహల్!

టీమిండియా వెటరన్ లెగ్ స్పిన్నర్ యుజ్వేంద్ర చాహల్ రెడ్ బాల్ ఫార్మాట్‌కు వీడ్కోలు పలికాడు. అంతర్జాతీయ టెస్ట్ క్రికెట్‌తో పాటు ఫస్ట్ క్లాస్ క్రికెట్‌కు గుడ్‌బై చెబుతున్నట్లు ప్రకటించాడు. కౌంటీ క్రికెట్‌లో భాగంగా లార్డ్స్‌లో తన చివరి ఫస్ట్ క్లాస్ మ్యాచ్ ఆడిన అనంతరం చాహల్ తన నిర్ణయాన్ని వెల్లడించాడు. దాంతో భారత్ తరఫున టెస్ట్ క్రికెట్ ఆడాలనే చాహల్ కలలకు అధికారికంగా తెరపడినట్లయింది. వైట్‌బాల్ క్రికెట్‌లో మాత్రం రీఎంట్రీ కోసం తన ప్రయత్నాలు కొనసాగుతాయని స్పష్టం చేశాడు. 'భారత్ తరఫున టెస్ట్ క్యాప్ అందుకోవడం నా కెరీర్ లో అతిపెద్ద కల. కానీ ఇకపై అది నెరవేరకపోవచ్చు. ఈ ఫార్మాట్‌లో ఇప్పటివరకు సాగిన నా ప్రయాణం ఎంతో సంతృప్తిని ఇచ్చింది. రెడ్ బాల్ క్రికెట్ అనేది ఓ ఫార్మాట్ మాత్రమే కాదు. ఆటగాళ్లకు ఓపిక, క్యారెక్టర్, మైదానంలో కొన్ని గంటల పాటు శ్రమించడంలో ఉన్న అసలైన సంతోషాన్ని తెలియజేస్తుంది.'అని చాహల్ చెప్పుకొచ్చాడు. హర్యానా తరఫున 2009లో చాహల్ ఫస్ట్‌క్లాస్ కెరీర్‌ను ప్రారంభించాడు. తన 17 ఏళ్ల సుదీర్ఘ కెరీర్‌లో 49 ఫస్ట్ క్లాస్ మ్యాచ్‌లు మాత్రమే ఆడాడు.




32.27 యావరేజ్‌తో 148 వికెట్లు నేలకూల్చాడు. కౌంటీ క్రికెట్‌లో ఇంగ్లండ్ నార్తాంప్టన్‌షైర్ క్లబ్‌కు ప్రాతినిధ్యం వహించిన చాహల్.. అద్భుత ప్రదర్శన కనబర్చాడు. కౌంటీ చాంపియన్‌షిప్-2లో 6 మ్యాచ్‌ల్లోనే 16.14 సగటుతో 21 వికెట్లు పడగొట్టి అందరి దృష్టినీ ఆకర్షించాడు. లార్డ్స్ లో మిడిల్‌సెక్స్‌తో జరిగిన మ్యాచ్ చాహల్ కెరీర్‌లో చివరి ఫస్ట్‌క్లాస్ మ్యాచ్‌గా నిలిచింది. టీమిండియా టెస్ట్ జట్టులో రవిచంద్రన్ అశ్విన్, రవీంద్ర జడేజాలు సుదీర్ఘ కాలం సత్తా చాటడంతో చాహల్‌కు అవకాశం లేకుండా పోయింది.

## (సంపాదకీయం)

# సామాన్యులపై ధరల మోత!?

ఎల్‌నినో ప్రభావంతో దేశవ్యాప్తంగా వర్షపాతం సాధారణం కంటే తక్కువగా నమోదైంది. ఈసారి భారత్?లోకి నైరుతి ఆగమనం ఆలస్యమైంది. భారత వాతావరణ శాఖ మే 26న నైరుతి రుతుపవనాలు కేరళ తీరాన్ని తాకుతాయని అంచనా వేసినప్పటికీ ఆ అంచనాలన్నీ తలకిందులయ్యాయి. జూన్ 1వ తేదీన కూడా ప్రవేశించలేదు. నాలుగు రోజులు ఆలస్యంగా కేరళలోకి ప్రవేశించాయి. కానీ ఆశించినంతంగా వర్షాలు కురవలేదు. ఈ లోటు వర్షపాతంతో నీటి ఎద్దడి ఎక్కవగా ఉండే ప్రమాదం ఉంది. మరోవైపు వర్షాభావ పరిస్థితులతో వ్యవసాయం సజావుగా సాగక వ్యవసాయాధారిత సరుకులపై తీవ్ర ప్రభావం చెపే ప్రమాదం లేకపోలేదు. తద్వారా సామాన్యులపై ధరల ప్రభావం అధికంగా ఉండే అవకాశం ఉంది. ఆహార సంక్షోభం ఏర్పడే పరిస్థితులు కనబడుతున్నాయి. ఈ మధ్య న్యూయార్క్ ఏషియా సొసైటీ వేదిక మీద భారత విదేశాంగ మంత్రి ఎస్ జైశంకర్ రానున్న ఆహార సంక్షోభం గురించి చేసిన హెచ్చరికలు ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తున్నాయి.. ఆయన చేసిన హెచ్చరిక కొత్తగా పుట్టుకు వచ్చింది కాదు. కొన్నాళ్లుగా దానిపై దేశంలో చర్చ నలుగుతూనే ఉన్నది. గోడదెబ్బ, చెంపదెబ్బ అన్నట్టుగా అంతర్జాతీయ సమస్యలు ఓ వైపు, పర్యావరణ క్షీణత మరోవైపు నుంచి తరుముతున్నాయి. ఉక్రెయిన్‌పై రష్యా యుద్ధం, ఇరాన్‌పై అమెరికా యుద్ధం, అంతర్జాతీయంగా చమురు, ఎరువుల సంక్షోభాన్ని తీవ్రతరం చేస్తున్నాయి. అమెరికా విధిస్తున్న పరిహార ఆంక్షలు దీనికి ఆజ్యం పోస్తున్నాయి. యుద్ధాలు, సరఫరా వ్యవస్థల్లో అంతరాయాలు, ఇంధన ధరల అస్థిరత ప్రపంచ ఆర్థిక వ్యవస్థను కుదిపేస్తున్నాయి. ఈ సంక్షోభం భారత్ మీద ఎంత ప్రభావం చూపుతున్నదో నిర్ణయించేది మన దేశీయ సంసిద్ధత, విధానాల పటిష్టత, రాజకీయ విజ్ఞత మాత్రమే. దిగుమతులపై అధికంగా ఆధారపడటం భారత ఆర్థిక వ్యవస్థ ప్రధాన బలహీనత. ఇంధనం, ఎరువులు, ముడిసరుకుల విషయంలో విదేశీ మార్కెట్లపై ఆధారపడటం వల్ల అంతర్జాతీయ ధరలు పెరిగితే దేశీయంగా ఆ భారం మోయక తప్పదు. మరోవైపు సబ్సిడీలు పెంచాల్సి రావడం సహజం, ఆర్థిక లోటు పెరుగుదల, పరిమిత ఆదాయ వనరులు ప్రభుత్వ ఆర్థిక నిర్వహణ సామర్థ్యానికి పరీక్షలుగా మారాయి. ఇక ఎల్ నినో ప్రభావం ఈ సవాళ్లకు మరొక అదనపు ముప్పును జోడిస్తున్నది. సాధారణంగా ఎల్ నినో వల్ల వర్షపాతం తగ్గిపోయి, ఉష్ణోగ్రతలు పెరిగిపోతాయి. దీనివల్ల పంటలు దెబ్బతిని ఆహార కొరత ఏర్పడుతుంది. మహారాష్ట్రలో ఇప్పటికే కరువు పరిస్థితులు ఏర్పడ్డాయి. మన రాష్ట్రంలో ఈ ఏడాది మొత్తంగా చూస్తే వర్షపాతం సాధారణ స్థాయిలో ఉన్నట్టు చెప్తున్నప్పటికీ, 18 జిల్లాల్లో లోటు వర్షపాతం నమోదైంది. ఇటీవలి వర్షపాతం గణాంకాలు ఆందోళన కలిగిస్తున్నాయి. ఆగస్టులోనే సుమారు 38 శాతం వరకు వర్షాభావం నమోదవడం, మొత్తం మాన్సూన్ కూడా సాధారణ స్థాయికి తగ్గిపోవడం పరిస్థితి తీవ్రతను స్పష్టంగా తెలియజేస్తున్నాయి. ఎల్ నినో ప్రభావంతో దేశవ్యాప్తంగా ఏర్పడిన వర్షాభావంలో భాగమే ఇది. దేశం మొత్తం గత దశాబ్దంలోనే కనిష్ఠ వర్షపాతం నమోదవడం ఈ సమస్యకు స్పష్టమైన సూచన. నాగార్జునసాగర్ వంటి కీలక జలాశయాలు ఇప్పటికీ పూర్తిస్థాయిలో నిండలేదు. ప్రవాహాలు అస్థిరంగా ఉండటం వల్ల భవిష్యత్ నీటి లభ్యతపై స్పష్టత లేదు. ముఖ్యంగా సెప్టెంబర్‌అక్టోబర్‌లో వచ్చే ప్రవాహాలపై ఆధారపడే పరిస్థితి గతంలో ఉన్నా, ఇప్పుడు వర్షాల అస్థిరత కారణంగా ఆ నమ్మకం తగ్గిపోయింది. దేశవ్యాప్తంగా పరిస్థితి మరింత ఆందోళనకరంగా ఉన్నది. దక్షిణ భారత రాష్ట్రాల రిజర్వాయర్లు కేవలం సుమారు 50 శాతం సామర్థ్యంతోనే ఉండటం సమస్య తీవ్రతను తెలియజేస్తున్నది. రాష్ట్రంలోని కాంగ్రెస్ సర్కార్ అందుబాటులో ఉన్న ప్రాజెక్టులను పడావుపెట్టి, పెండింగ్ ప్రాజెక్టులను నిర్లక్ష్యం చేయడం వల్ల సాగునీరు తగిన స్థాయిలో అందుబాటులోకి రావడం లేదు. భూగర్భ నీటిమట్టాలు భారీగా పడిపోతున్నాయి. మరోవైపు పంట పెట్టుబడుల సమస్య వేధిస్తున్నది. ఇవన్నీ వెరసి సాగును సంకటంలో పడేస్తున్నాయి. ప్రస్తుతం దేశంలో ఆహార కొరత లేకపోయినప్పటికీ, వ్యవసాయ ఉత్పత్తుల ధరల పెరుగుదల సమస్య మాత్రం తీవ్రంగానే ఉంటుందని ఆర్థిక నిపుణులు అంటున్నారు. బహిరంగ మార్కెట్లో ఈసరికే రూ.70 దాటిన బియ్యం ధరలు సెంచరీ కొడతాయనే ఊహాగానాలు వినిపిస్తున్నాయి. మరోవైపు ఉల్లిగడ్డల ధరలు కూడా కిలో రూ.60 దాటిపోయాయి. ఇక కూరగాయలు, ఇతర సరుకుల ధరలు సామాన్యులకు మోయరాని భారంగా పరిణమిస్తున్నాయి. ఈ నేపథ్యంలో రాబోయే రోజుల్లో ఆహార సమస్య తీవ్రరూపం దాల్చవచ్చని విదేశాంగమంత్రి చేసిన హెచ్చరిక ప్రాముఖ్యం సంతరించుకున్నది. ధరల సమస్య స్థానంలో తీవ్రమైన ఆహార కొరత ఎదురుకాకుండా చూడటం కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకు పెనుసవాల్‌గా ఉంటుంది. తక్షణం వ్యవసాయరంగ సమస్యలపై అవి సమన్వయంతో దిద్దుబాటు చర్యలు తీసుకోవాలి. ఏది ఏమైనా ఈసారి ఎల్‌నినో సృష్టించిన ఈ పెను విపత్తును ముందుగా గ్రహించి ప్రభుత్వాలు తగిన చర్యలు తీసుకుంటే తప్ప ఈ గండం నుండి గట్టెక్కే పరిస్థితులు లేవని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

# రేవంత్ రెడ్డి కుటుంబం వ్యాపారాలు పెరిగినయి..

- **తప్పని నిరూపిస్తే మరోసారి ప్రెస్‌మీట్ పెట్ట**
- **కేటీఆర్ హోటల్ గురించి అఫిడవిట్‌లో పెట్టారు**
- **బీఆర్ ఎస్ నేత మన్నె క్రిశాంక్ కీలక వ్యాఖ్యలు**

హైదారాబాద్, అక్టోబర్ 03: మా దగ్గరున్న వివరాలన్నీ మీకు పోస్ట్ ద్వారా మీమీ కార్యాలయాలకు పంపిస్తం.. కేంద్రంలో ఉన్న బీజేపీ నాయకత్వానికి దమ్ముంటే రేవంత్ మెడికోవర్ అంశంపై విచారణ చేపట్టాలని బీఆర్ ఎస్ మన్నెక్రిశాంక్ సవాల్ విసిరారు. తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. మెడికోవర్ ఆస్పత్రుల మీద, మ్యాక్స్‌పియన్ ఫార్మా మీద కార్పోరేట్ స్కూల్స్ నిర్మాణం చేస్తున్న మైండ్ వాల్డ్ కన్‌స్ట్రక్చన్స్ మీద విచారణ చేపట్టండి.. అంటే రెండున్నరేళ్ళలో రేవంత్ రెడ్డి కుటుంబం వ్యాపారాలు పెరిగినయి. ముఖ్యమంత్రి అయిన తర్వాత ప్రభుత్వం వచ్చాక షోరూంలు, కారు షోరూంలు హెల్త్ ఆస్పత్రులు, స్కూల్స్ తో దండపాళ్యం బ్యాచ్ దోచుకుంటున్నది కాబట్టి... వాస్తవానికి ఇవాళ కృశ్చన్ చేసేటప్పుడు అందరు అన్నరు.. ఇప్పటికే రెండు సార్లు జైలుకు పంపించిర్రు. మొన్న ఇంటి తలుపులు బద్దలు కొట్టారు. చిన్నపాపను కూడా బెదిరించారు. రేవంత్ రెడ్డి చేయాల్సినవన్నీ చేసేశాడు.. ఇంకేం చేస్తడు.. మా అంటే ఇక భౌతిక దాడో.. ఎన్‌కౌంటరో చేపిస్తడన్నారు. మెడికోవర్ హాస్పిటల్స్, మాక్స్ బీఎన్ ఫార్మా, మైండ్ వాల్ కన్‌స్ట్రక్షన్స్, శోదా కన్‌స్ట్రక్షన్స్, స్వచ్ బయో, టెసెరాక్ట్ అడ్వాన్స్‌డ్ సిస్టమ్స్ స్కాంల మీద రేవంత్ రెడ్డి సోదరులు, కుటుంబసభ్యులు రూ.50 వేల కోట్ల స్కాంలు చేశారు. వీటి అన్ని ఆధారాలను కాపీలతో ఈడీకి, మల్లికార్జున ఖర్గేకు, ప్రధాని కార్యాలయానికి, రాష్ట్రపతి కార్యాలయానికి, ప్రతిపక్ష నాయకులకు అందరికీ పంపిస్తానన్నారు మన్నె క్రిశాంక్. మెడికోవర్ హాస్పిటల్స్, మాక్స్ బీఎన్ ఫార్మా, మైండ్ వాల్ కన్‌స్ట్రక్షన్స్‌లో ఎందుకు దుంప శిరీష డైరెక్టర్‌గా ఉన్నారు..? నేను చెప్పినవి తప్పు అని నిరూపిస్తే మరోసారి ప్రెస్‌మీట్ పెట్టనని.. రేవంత్ రెడ్డి కుటుంబానికి బహిరంగ క్షమాపణలు చెప్తా.. వీటిపై విచారణకు రేవంత్ రెడ్డి సిద్ధమా? అని మన్నె క్రిశాంక్ ప్రశ్నించారు. కేటీఆర్ హోటల్ అని కొందరు కాంగ్రెస్ నేతలు, వాళ్ల పెయిడ్ బ్యాచ్ పంపించి వీడియోలు చేస్తున్నరని మండిపడ్డారు. తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. తిప్పి కొడితే అది కిరాయి బంగ్లా.. అందులో హోటల్ నడిపిస్తున్నారు. వీళ్లేదైతే హోటల్ అంటున్నరో 2009లోనే కేటీఆర్ హోటల్ గురించి అఫిడవిట్‌లో పెట్టారు..కానీ దాన్ని ఒక పెద్ద భూతద్దం పెట్టి హరీశ్ రావు ఎన్నికల అఫిడవిట్‌ను, కేసీఆర్ ఎన్నికల అఫిడవిట్‌ను చూపెట్టి ఇగో చూడండి.. రాష్ట్రమంతా కూడా ఇంత ఆస్తులు.. ఏమున్నది కేసీఆర్ పొలం లేదా కేటీఆర్ ఒక కిరాయి బంగ్లాలో నడిపిస్తున్న హోటల్.. లేదా హరీశ్ రావుకున్న పొలం, ఏమైనా భూములు గంతేనన్నారు. రేవంత్ రెడ్డి మూడేళ్లలో ఒక్క ప్రభుత్వ హాస్పిటల్, ఒక ప్రభుత్వ పాఠశాల కూడా నిర్మించలేదన్నారు మన్నె క్రిశాంక్.. పోనీ విద్యాశాఖ మంత్రిగా నువ్వేమైనా చేసినవా అంటే ప్రభుత్వ పాఠశాలలను, గురుకుల పాఠశాలలను రేవంత్ రెడ్డి పట్టించుకుంటలేరు.. కొంపల్లిలో రేవంత్ రెడ్డి అమ్మాయికి చెందిన నిర్మాణం అవుతున్న స్కూల్ బిల్డింగ్ ఇది. దానికి సంబంధించిన ల్యాండ్ డాక్యుమెంట్స్ ఉన్నాయి.. సర్వే నంబర్ 87. అనుముల నిమిషా రెడ్డి రిప్రజెంటెడ్ బై సూరం అనిల్ కుమార్ రెడ్డి అని పెట్టారు. ఎవరీ సూరం అనిల్ కుమార్ రెడ్డి.. రేవంత్ రెడ్డి మెస్సీతో ఫుట్ బాల్ మ్యాచ్ ఆడేందుకు వచ్చినప్పుడు మనవడిని కూడా ఎత్తుకొచ్చిండు కదా.. ఆయననే ఇందులో మొదటి ఫొటో సూరం అనిల్ కుమార్ రెడ్డి, రిప్రజంటేటివ్ ఆఫ్ నిమిషా రెడ్డి అని ఉన్నదన్నారు. ఇంతకీ రేవంత్ రెడ్డి కూతురుతో ఇన్ని వ్యాపారాలు చేస్తున్న ఎంజెల్ ఇన్వెస్టర్ దుంప శిరీష ఎవరు అని ప్రశ్నించారు. దుంప శిరీష మాక్సిపియన్ ఫార్మాలో రేవంత్ రెడ్డి అల్లుడితో ఉంటరు. మెడికోవర్ ఆస్పత్రిలో ఉంటరు.. నిమిషారెడ్డితో ఇందులో కూడా పార్ట్‌నర్‌గా ఉంటరని ప్రశ్నించారు.



# ఆయుధాల చోరీ కేసులో సంచలన విషయాలు

**మల్లేష్ ద్వారా వెలుగులోకి వచ్చిన నిజాలు**

హైదారాబాద్, అక్టోబర్ 03 సికింద్రాబాద్ మద్రాస్ రెజి మెంట్ ఆయుధాల చోరీ కేసులో మల్లేష్ ద్వారా సంచలన విషయాలు వెలుగులోకి వచ్చాయి. 10రోజుల పోలీస్ కస్టడీలో కీలక సమాచారాన్ని సేకరించి అధికారులు నేరాంగీకార వాంగ్మూ లాన్ని నమోదు చేశారు. 2009లో ఆర్మీ జవా నుగా చేరినప్పటినుంచే ఆయుధాలు, మందు గుండు సామగ్రిపై మల్లేష్ శిక్షణ పొందాడు. మిలటరీ కంటోన్మెంట్లలోని ఆయుధాగారాలు బాధ్యతలు నిర్వహించడంతో ఆయుధాల గురించి పూర్తిగా అవగాహన ఉందని మల్లేష్ వివరించాడు. ఆయుధాల పట్ల అన్ని విషయా లను తెలుసుకుంటూ వాటి వాడకం పట్ల అప్ప టినుంచే అవగాహన పెంచుకున్నాడు. అప్పులు తీర్చేందుకు ఇబ్బందులు ఎదుర్కొంటున్న తరుణంలోనే ఆయుధాలు చోరీ చేయాలని నిర్ణ యించుకున్నాడు. చోరీ చేసిన ఆయుధాలను అమ్మి డబ్బు సంపాదించుకోవాలని అనుకు న్నాడు. చోరీ చేసిన ఆయుధాలను సంఘ విద్రో హశక్తులకు అమ్మేందుకు పథకం రచించాడు. ఆర్థిక ఇబ్బందులను తొలగించుకునే ప్రయత్నం లోనే ఆయుధాల చోరీకి పాల్పడినట్టు అంగీకరించాడు. 2026 జూలైలో మద్రాస్ రెజిమెం ట్లో పలుమార్లు రెక్కీ నిర్వహించినట్టు మల్లేష్ నేరాన్ని అంగీకరించాడు. సహచరులు శేషు, వినోద్, ప్రవీణ్ లు మల్లేష్కు సహకరించడం తోనే ఆయుధాలను చోరీ చేసినట్టు అధికారులు గుర్తించారు. చోరీ పాల్పడిన నాటికి ముందు వారంరోజుల క్రితమే సీసీ కెమెరాలను నిర్వీర్యం చేసినట్టు ఒప్పుకున్నాడు. సీసీ కెమె రాలపై ఫోమ్బుల్లి దృశ్యాలు రికార్డు కాకుండాచేసినట్టు తెలిపాడు. విద్యుత్ దీపాలను సైతం ఆర్పివేసి మల్లేష్ తోపాటు సహచరులు భద్రత జవాన్ల దృష్టిని మళ్లించారు. సుమారు గంటన్నరపాటు చోరీ చేసిన ఆయుధాలను తరలించి నట్టు వెల్లడించాడు. తొలుత ఆయుధాలను బైక్పై ఆ తర్వాత కారులో ఆయుధాలను నాగ రికర్నూల్లోని తన ఇంటికి తరలించినట్టు అంగీకరించాడు. కొల్కత్తాకు చెందిన బీర్బల్ షాను ఫోన్ ద్వారా సంప్రదించాడు. బీర్బల్షా ద్వారా అవలెయ్ అలియాస్ ఓబీకి ఆయు ధాలు విక్రయించేందుకు డీల్ కుదుర్చుకు న్నాడు. ఏకే-47 (నాలుగు) రూ.5లక్షలకు, పిస్టళ్లు రూ. 3 లక్షలకు బేరం కుదుర్చుకున్నాడు. అగస్టు29న బీర్బల్ మల్లేష్కు ఫోన్ చేసినట్టు కాల్ డేటా ద్వారా అధికారులు ఆరా తీయగా, ఆయుధాల డెలివరీ ఆలస్యం కావడంతో బీర్బలా తనకు ఫోన్ చేసినట్టు మల్లేష్ బదులి చ్చాడు. బంగ్లాదేశ్ నుంచి అక్రమంగా భారత్కు వచ్చేవారితోనూ, రోహింగ్యాలతో సన్నిహిత సంబంధాలున్నట్టు పోలీసుల విచారణలో వెల్ల డైంది. 2007లో అమ్రాబాద్, అచ్చంపేట పోలీస్ స్టేషన్ల పరిధిలో ఇండ్ల దొంగతనాల కేసుల్లో మల్లేష్ నిందితుడిగా ఉన్నట్టు అధికా రులు గుర్తించారు. బీర్బల్, అవల్దేవ్ కోసం ఆరు ప్రత్యేక బృందాలు తనిఖీలు నిర్వహిస్తు న్నాయి. వారిని అదుపులోకి తీసుకోవడంతో అక్రమ ఆయుధాల క్రయవిక్ర యాలపై మరింత సమాచారం లభిస్తుందని అధికారులు భావిస్తు న్నారు. సహచరులు శేషు, వినోద్, ప్రవీణ్ ను అధికారులు అదుపులోకి తీసుకుని విచారిస్తు న్నారు. సేకరించిన కీలక ఆధారాలను, మల్లేష్ నేరాంగీకార పత్రాన్ని కోర్టుకు సమర్పించారు.

# రాష్ట్ర బీసీ కమిషన్ సమావేశం



హైదారాబాద్, అక్టోబర్ 03 రాష్ట్ర బీసీ కమిషన్ సమావేశం శనివారం మధ్యాహ్నం 1:30 గంాలకు ఖైరతాబాద్‌లోని కమిషన్ కార్యాలయంలో ఛైర్మన్ జి. నిరంజన్ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో కమిషన్ సభ్యులు రాపోలు జయప్రకాష్, తిరుమలగిరి సురేందర్, డా. బాలలక్ష్మి రంగు మరియు కమిషన్ మెంబర్ సెక్రెటరీ బి. బాల మాయ దేవి, ఐ.ఏ.ఎస్., పాల్గొన్నారు. సమావేశానికి ముందు బీసీ కమిషన్, సిసిఎలఏ కార్యదర్శి టి.వెంకట్‌తో తొలగించిన కులాల పేరుపై జారీ చేయబడ్డ 2123 కుల సర్టిఫికేట్ల విషయమై వివరణ కోరడం జరిగింది. 2 నెలల లోపు వీటిపై విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకొని, 3 నెలల లోపు జారీ చేసిన కుల ధృవీకరణ పత్రాలు రద్దు చేయాలని ఆదేశించడం జరిగింది. వెంటనే ఈ కులాలకు కుల ధృవీకరణ పత్రాలు జారీ చేయకుండా ఆపుదల చేయాలని ఆదేశించడం జరిగింది. పంబాల కులాల సర్టిఫికేట్ల విషయమై ఆ సర్టిఫికేట్లు జారీ చేసిన ప్రదేశాలకు సంబంధించిన 6 గురు తహశీల్దార్‌లతో కూడా కమిషన్ సమావేశం జరిపి పంబాల కులస్తుల వివరాలను రికార్డు చేయడం జరిగింది. ఈ సమావేశానికి ఫర్‌హీన్ షేక్ - హాత్‌నూర మండల్, సంగారెడ్డి జిల్లా, సి. హెచ్.రాజా నరేందర్ గౌడ్ - బాన్సువాడ మండలం, కామారెడ్డి జిల్లా, టి.రజని కుమారి - రామాయంపేట్ మండలం, మెదక్ జిల్లా, టి.విజయలక్ష్మి - పర్కాల్ మండలం, హనుమకొండ జిల్లా, ఎం.డి.మన్సూర్ అలీ సిద్దిఖి - మనోపాడ్ మండలం, జోగులాంబ గద్వాల్ జిల్లా, కె.సవాయ్ సింగ్ - బిర్‌కుర్ మండలం, కామారెడ్డి జిల్లా వారు పాల్గొన్నారు రాష్ట్రంలో బీసీ రక్షణ చట్టాన్ని అమలు చేయాలని అందుకు తగిన చర్యలు తీసుకోవాలని బీసీ కమిషన్ రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరడం జరిగింది. నిజమాబాద్ జిల్లాలో విలేజ్ డెవలప్‌మెంట్ కమిటీస్ ద్వారా కొన్ని కులాల వారిని బహిష్కరణ చేయడాన్ని కమిషన్ తీవ్రంగా పరిగణించింది. ఈ నెల 7వ తేదిన కమిషన్ నిజమాబాద్ జిల్లా కలెక్టర్ ఆఫీసులో ఆ జిల్లాలో ఇటువంటి వేధింపులకు గురవుతున్న వారితో సమావేశం కావాలని నిర్ణయించింది. ఆ తర్వాత జిల్లా కలెక్టర్, పోలీస్ కమిషనర్ మరియు ఇతర పోలీస్ అధికారులు మరియు బీసీ వెల్ఫేర్ డిపార్ట్‌మెంట్‌కు సంబంధించిన అధికారులతో సమావేశమై ఈ జాడ్యాన్ని అరికట్టే విషయమై చర్చించాలని నిర్ణయించింది. ఇటీవల లొద్ద కులస్థుల సామాజిక, విద్య, ఆర్థిక స్థితిగతులను ప్రత్యక్షంగా పరిశీలించడానికి కామారెడ్డి, సంగారెడ్డి మరియు మెదక్ జిల్లాలలో జరిపిన పర్యటనను కమిషన్ సమీక్షించింది. సదరు కులస్థుల స్థితిగతుల అధ్యయనానికై సెస్ సంస్థ ద్వారా ప్రత్యేక సర్వే చేయించాలని కమిషన్ నిర్ణయించింది. ఒక విద్యార్థినికి సంబంధించిన అడ్మిషన్ విషయంలో ఆ విద్యార్థి తెలంగాణకు చెందిన విద్యార్థి అయినా, పుట్టి పెరిగింది ఇక్కడే అయినా, 10వ తరగతి వరకు ఇక్కడే చదివినా, ఆ తర్వాత ఇంటర్మీడియట్ బయట ప్రాంతాలలో చదివినందున ఆ విద్యార్థి స్థానిక విద్యార్థి కాదు అని సుప్రింకోర్టు ఇటీవల ఇచ్చిన తీర్పును చర్చించిన కమిషన్ ఈ విషయమై తెలంగాణ విభజన సమయంలో జారీ చేయబడ్డ ప్రెసిడెన్షియల్ ఆర్డర్‌లో సవరణ తీసుకురావాలనే అవసరం ఉందని పేర్కొంటూ తగు చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరుతూ తీర్మాణం చేయడం జరిగింది.




## శాంసంగ్ కీలక నిర్ణయం..

# భారత్‌లో లేఆఫ్స్

శాంసంగ్ ఇండియా కీలక నిర్ణయం తీసుకుంది. టీవీలు, ఇతర గృహోపకరణాలకు డిమాండ్ తగ్గుతుండటంతో పాటు ఖర్చులు కూడా పెరగడంతో ఉద్యోగులను తొలగించేందుకు నిర్ణయించినట్టు తెలుస్తోంది. భారత్‌లో కార్యకలాపాలను పునర్ వ్యవస్థీకరించే దిశగా ఇప్పటికే దాదాపు 100 మందిని తొలగించినట్టు జాతీయ మీడియాలో కథనాలు వెలువడ్డాయి. డైరెక్టర్ స్థాయి అధికారులు మొదలు ప్రధాన కార్యాలయంలోని టీమ్ లీడర్లపై తొలగింపుల ప్రభావం ఉన్నట్టు సమాచారం. బ్రాంచ్, ఏరియా మేనేజర్లు కూడా లేఆఫ్స్‌కు గురైనట్టు తెలుస్తోంది. మెమరీ చిప్‌ల ధరల పెరుగుదల, రూపాయి బలహీనంగా ఉండటం, ముడి సరకు ధరలు పెరగడం వంటివి శాంసంగ్ ఇండియా అమ్మకాలు, మార్జిన్లపై ప్రభావం చూపినట్టు మీడియాలో కథనాలు వెలువడ్డాయి. టీవీలు, ఇతర గృహోపకరణాల విభాగానికే ప్రస్తుత తొలగింపులు పరిమితమయ్యాయి. అయితే, లేఆఫ్ విస్తృతి మరింత ఎక్కువగా ఉండవచ్చన్న అంచనాలు కూడా ఉన్నాయి. శాంసంగ్ సేల్స్, మార్కెటింగ్ విభాగంలోని 25 శాతం మంది సిబ్బందిపై లేఆఫ్స్ ప్రభావం ఉండే అవకాశం ఉందని సమాచారం. రోజూ కొందరికి టర్మినేషన్ లెటర్లు అందుతున్నాయని లేఆఫ్స్‌కు గురైన వ్యక్తి ఒకరు చెప్పటినట్టు మీడియాలో కథనాలు వెలువడ్డాయి. నోటీస్ పీరియడ్ అవసరం లేకుండానే పంపించేస్తున్నారని సదరు వ్యక్తి చెప్పినట్టు తెలుస్తోంది. ఇక తొలగింపునకు గురైన వారికి మూడు నెలల శాలరీ ఇవ్వడంతో పాటు సంస్థలో పని చేసిన ప్రతి సంవత్సర కాలానికి గాను ఒక నెల జీతం అదనంగా కూడా పరిహారంగా ఇచ్చినట్టు కథనాలు వెలువడ్డాయి. ప్రస్తుతం భారత్‌లో స్మార్ట్ ఫోన్ మార్కెట్‌లో కూడా డిమాండ్ తగ్గినట్టు ఇండస్ట్రీ వర్గాలు చెబుతున్నాయి. స్మార్ట్ ఫోన్ అమ్మకాలు 12 శాతం మేర తగ్గాయని చెప్పాయి. ప్రస్తుతం భారత్‌లో శాంసంగ్ ఆదాయంలో దాదాపు 75 శాతం స్మార్ట్ ఫోన్ అమ్మకాల ద్వారా వస్తున్నట్టు సమాచారం. ఈ నేపథ్యంలో శాంసంగ్ స్మార్ట్‌ఫోన్ విభాగంలోని సిబ్బందికి ప్రస్తుతానికి లేఆఫ్స్ ముప్పు తప్పింది. అయితే, దీపావాళి తరువాత మరిన్ని లేఆఫ్స్ ఉండే అవకాశం ఉందని కూడా తెలుస్తోంది.

## భారతీయుల మనీవాలెట్

# వరుస మారుతోంది!




జీతం చేతికి అందగానే కొత్త ఫోన్ కొనడం, కారు కొనడం లేదా విహారయాత్రలకు వెళ్లడం గురించి ఎక్కువగా ఆలోచించే భారతీయ కుటుంబాలు, ఇప్పుడు తమ ప్రాధాన్యతలను మార్చుకుంటున్నాయి. ప్రతి నెలా వచ్చే ఆదాయంలో ఎంత మొత్తం సొంత ఇంటి కోసం కేటాయించాలి, ఎంత పొదుపు లేదా పెట్టుబడి పెట్టాలి, ఆపత్కాల నిధి (జుఎవతీస్త్రవఅఎ ఫీబఅ) ఎంత దాచుకోవాలనే అంశాలపై ప్రధానంగా దృష్టి సారిస్తున్నాయి. 'హోమ్ క్రెడిట్ ఇండియా' ఇటీవల విడుదల చేసిన 'ది గ్రేట్ ఇండియన్ వాలెట్ 2026' నాల్గవ ఎడిషన్ నివేదిక ప్రకారం, భారతీయ వినియోగదారులు కేవలం వస్తువులను కొనుగోలు చేయడం నుంచి భావి తరాల కోసం ఆస్తులను సృష్టించే వైపు వేగంగా అడుగులు వేస్తున్నారు.

వినియోగదారుల ఆర్థిక లక్ష్యాలలో సొంత ఇల్లు కొనుగోలు చేయడం అత్యంత కీలకమైన అంశంగా మారింది. నివేదిక ప్రకారం, సర్వేలో పాల్గొన్న వారిలో 31శాతం మంది రాబోయే ఐదేళ్లలో సొంత ఇల్లు కొనాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. మహిళల్లో ఈ ఆకాంక్ష మరీ ఎక్కువగా ఉంది. దాదాపు 40శాతం మంది మహిళలు సొంతింటి కలను తమ ప్రధాన ఆర్థిక లక్ష్యంగా పేర్కొన్నారు.

**పెరుగుతున్న పొదుపు, పెట్టుబడులు**

ఖర్చుల కంటే పొదుపుకే భారతీయులు ఇప్పుడు ప్రాధాన్యత ఇస్తున్నారు. సర్వేలోని 46శాతం మంది తాము గతంతో పోలిస్తే పొదుపు పెంచామని చెప్పగా, 44శాతం మంది పెట్టుబడులను పెంచామని తెలిపారు.

తరాల వారీగా చూస్తే, జనరేషన్-జెడ్‌అత్యధికంగా 58శాతం పొదుపు చేస్తూ అగ్రస్థానంలో ఉంది. మిలీనియల్స్ 53శాతం, +వఅ ఴ 44శాతం మేర పొదుపు చేస్తున్నారు.

యువత వినోదం, స్థానిక పర్యటనల వంటి వాటికి ఖర్చు చేస్తున్నప్పటికీ, దానికి సమాంతరంగా పెద్ద ఆర్థిక లక్ష్యాల కోసం పొదుపు చేయడాన్ని అలవాటు చేసుకుంటున్నారు.

**ఆస్తి సృష్టి, వ్యాపార ఆకాంక్షలు**

ఇంటి కొనుగోలుతో పాటు సొంతంగా వ్యాపారాన్ని ప్రారంభించడం లేదా ఉన్న వ్యాపారాన్ని విస్తరించడం కూడా ఒక ముఖ్య లక్ష్యంగా మారింది. 25శాతం మంది రాబోయే ఐదేళ్లలో నూతన వ్యాపారం వైపు అడుగులు వేయాలని భావిస్తున్నారు. వర్గంలో ఇది అత్యధికంగా 31శాతంగా ఉంది. పురుషులలో 26శాతం, మహిళల్లో 20శాతం మంది వ్యాపార ఆలోచనలను కలిగి ఉన్నారు.

# వంటల్లో ఇంగువను తప్పనిసరిగా వేయాల్సిందే

## దీంతో ఎలాంటి లాభాలు కలుగుతాయంటే..?



భారతీయ వంటకాలలో రుచితోపాటు జీర్ణక్రియకు కూడా ప్రాధాన్యం ఉంటుంది. అందుకే తరతరాలుగా వంటల్లో కొన్ని సుగంధ ద్రవ్యాలు, ప్రత్యేకమైన వంట పద్ధతులను ఉపయోగిస్తున్నారు. ముఖ్యంగా పప్పులు, శనగలు, చిక్కుళ్లు వంటి ఆహార పదార్థాలు కొంతమందిలో గ్యాస్, కడుపు ఉబ్బరం, అసౌకర్యాన్ని కలిగిస్తాయి. ఇలాంటి ఆహారాన్ని సులభంగా జీర్ణం చేసుకునేందుకు భారతీయ వంటగదిలో పాటించే సంప్రదాయ పద్ధతుల్లో ఇంగువ వాడకం కూడా ఒకటి. గ్యాస్, కడుపు ఉబ్బరం, కడుపులో అసౌకర్యం వంటి జీర్ణ సమస్యలు చాలామందిని ఇబ్బంది పెడుతుంటాయి. పప్పులు, బీన్స్, కందులు, కొన్ని రకాల కూరగాయలు తిన్న తర్వాత కొందరిలో ఈ సమస్యలు ఎక్కువగా కనిపిస్తాయి. అయితే వీటిలో ఫైబర్, ప్రొటీన్, ఇతర పోషకాలు పుష్కలంగా ఉన్నప్పటికీ, సరిగ్గా తయారు చేయకపోతే కొంతమందికి జీర్ణం కావడం కష్టంగా ఉంటుంది.

జీర్ణ సమస్యలకు చెక్..ఇలాంటి సందర్భాల్లో ఇంగువ ఉపయోగపడే అవకాశం ఉంటుందని సంప్రదాయ వంట విధానాలు సూచిస్తున్నాయి. ఆహారంలో కొద్దిగా ఇంగువను కలపడం వల్ల గ్యాస్, కడుపు ఉబ్బరం, పొత్తికడుపులో అసౌకర్యం వంటి సమస్యలు కొంతవరకు తగ్గే అవకాశం ఉంటుందని ఆయుర్వేద వైద్య నిపుణులు చెబుతున్నారు. అందుకే పప్పులు, బీన్స్, కందులు వంటి ఆహార పదార్థాలను వండేటప్పుడు ఇంగువను ఉపయోగించే అలవాటు భారతీయ వంటల్లో చాలాకాలంగా ఉంది. ఇంగువలోని కొన్ని సమ్మేళనాలు జీర్ణక్రియకు సంబంధించిన ఎంజైమ్‌ల కార్యకలాపాలను ప్రేరేపిస్తాయని కొన్ని పరిశోధనలు సూచిస్తున్నాయి. ముఖ్యంగా ప్యాంక్రియాటిక్ అమైలేజ్, లైపేజ్ వంటి జీర్ణ ఎంజైమ్‌లపై ఇవి ప్రభావం చూపే అవకాశం ఉందని చెబుతున్నారు. అందువల్ల ఇంగువ కేవలం ఆహారానికి ప్రత్యేకమైన రుచిని, వాసనను అందించడమే కాకుండా జీర్ణక్రియకు కూడా తోడ్పడే అవకాశం ఉందని చెబుతున్నారు.

**ఇవి కూడా ముఖ్యమే..**

అయితే జీర్ణక్రియకు ఉపయోగపడే సంప్రదాయ పదార్థం ఇంగువ ఒక్కటే కాదు. ఆహారాన్ని నానబెట్టడం, మొలకెత్తించడం, పులియబెట్టడం, నెమ్మదిగా ఉడికించడం వంటి సంప్రదాయ వంట పద్ధతులు కూడా కొన్ని ఆహార పదార్థాలను సులభంగా జీర్ణం అయ్యేలా చేయడంలో సహాయపడతాయి. ఈ పద్ధతులు ఆహారంలోని నిర్మాణాన్ని మార్చడంతో పాటు జీర్ణక్రియకు ఆటంకం కలిగించే కొన్ని సమ్మేళనాలను తగ్గించి, పోషకాలు శరీరానికి అందుబాటులోకి రావడానికి సహాయపడే అవకాశం ఉంటుంది.

# మహిళల్లో గుండె పోటు వచ్చే ముందు కనిపించే లక్షణాలు ఇవే..

## ఇవి కనిపిస్తే జాగ్రత్త పడాల్సిందే..



గుండెపోటు అంటే వెంటనే గుర్తొచ్చేది ఛాతిలో తీవ్రమైన నొప్పి. అయితే మహిళల్లో గుండెపోటు లక్షణాలు చాలాసార్లు ఇంత స్పష్టంగా కనిపించవు. సాధారణ అలసట, ఒత్తిడి, వయసు పెరగడం లేదా మెనోపాజ్ కారణంగా వచ్చిన మార్పులుగా భావించి కొన్ని లక్షణాలను మహిళలు నిర్లక్ష్యం చేసే అవకాశం ఉంటుంది. ముఖ్యంగా గుండెపోటుకు కొన్ని వారాల ముందే కనిపించే అసాధారణ అలసటను ఏమాత్రం తేలికగా తీసుకోకూడదని నిపుణులు సూచిస్తున్నారు. మహిళల్లో గుండె సంబంధిత సమస్యలను గుర్తించడంలో ఆలస్యం జరిగే అవకాశం ఉంటుంది. ఛాతి నొప్పితో పాటు అసాధారణంగా అలసటగా అనిపించడం, శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది, వికారం, నిద్రలో మార్పులు వంటి లక్షణాలు కూడా గుండెకు సంబంధించిన సమస్యలకు సంకేతాలు అవుతాయి. ఈ లక్షణాలను ఒత్తిడి, ఆందోళన, గ్యాస్ లేదా అజీర్ణం వంటి సాధారణ సమస్యలుగా భావించి నిర్లక్ష్యం చేస్తే చికిత్స ఆలస్యమయ్యే ప్రమాదం మహిళల్లో గుండెపోటుకు ముందుగా కనిపించే ముఖ్యమైన హెచ్చరిక సంకేతాల్లో అసాధారణమైన అలసట ఒకటి. ఎలాంటి స్పష్టమైన కారణం లేకుండా సాధారణం కంటే ఎక్కువగా అలసటగా అనిపించడం, రోజువారీ పనులు చేయడానికే శక్తి లేకపోవడం వంటి లక్షణాలు కనిపిస్తాయి. శరీరానికి రక్తప్రసరణ తగ్గడం వల్ల శక్తి స్థాయిలు తగ్గి ఈ విధమైన అలసట ఏర్పడే అవకాశం ఉంటుంది. ముఖ్యంగా గుండెపోటుకు కొన్ని వారాల ముందు ఇలాంటి మార్పులు కనిపిస్తాయని నిపుణులు చెబుతున్నారు. ఇవి కూడా కారణాలే..మధుమేహం, రక్తపోటు, కొలెస్ట్రాల్, ధూమపానం, ఊబకాయం, కుటుంబంలో గుండె జబ్బుల చరిత్ర, మెనోపాజ్, శారీరక శ్రమ లేకపోవడం వంటి అంశాలు మహిళల్లో గుండెపోటు ప్రమాదాన్ని పెంచుతాయి. అనారోగ్యకరమైన జీవనశైలి, అధిక ఉప్పు, ప్రాసెస్ చేసిన ఆహారాల అధిక వినియోగం, నియంత్రణలో లేని ఒత్తిడి కూడా గుండె ఆరోగ్యంపై ప్రతికూల ప్రభావం చూపుతాయి. అకస్మాత్తుగా ఛాతిలో అసౌకర్యం, కారణం తెలియని తీవ్రమైన అలసట, శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది లేదా దవడ, చేయి, మెడ, వీపు వైపు వ్యాపించే నొప్పి కనిపిస్తే అత్యవసర వైద్య సహాయం తీసుకోవాలి. ముఖ్యంగా లక్షణాలు కొన్ని నిమిషాలకంటే ఎక్కువసేపు కొనసాగితే ఆలస్యం చేయకుండా సమీప అత్యవసర విభాగాన్ని సంప్రదించడం అవసరం.

ఏం చేయాలి..గుండెపోటు ప్రమాదాన్ని తగ్గించుకోవడానికి మహిళలు గుండెకు మేలు చేసే ఆహారాన్ని తీసుకోవడం, క్రమం తప్పకుండా వ్యాయామం చేయడం, ధూమపానానికి దూరంగా ఉండడం, రక్తపోటు, కొలెస్ట్రాల్‌ను నియంత్రణలో ఉంచడం, మధుమేహాన్ని అదుపులో ఉంచడం వంటి చర్యలు చేపట్టాలి.

# పోషకాల కోసం సప్లిమెంట్లను తీసుకోవాల్సిన పనిలేదు..



శరీరానికి అవసరమైన విటమిన్లు, ఖనిజాలు, ప్రొటీన్లు, ఆరోగ్యకరమైన కొవ్వులు, కార్బొహైడ్రేట్లు వంటి పోషకాలను పొందడానికి సమతుల్యమైన ఆహారం తీసుకోవడం చాలా ముఖ్యం. అయితే రోజువారీ ఆహారం ద్వారా లభించే పోషకాలపై అవగాహన లేకపోవడంతో చాలామంది అవసరం ఉన్నా లేకపోయినా సప్లిమెంట్లపై ఆధారపడుతున్నారు. కానీ మనం తీసుకునే సాధారణ ఆహారంలోనే అనేక ముఖ్యమైన పోషకాలు లభిస్తాయని నిపుణులు చెబుతున్నారు. పోషకాలు సమృద్ధిగా ఉన్న వివిధ రకాల ఆహార పదార్థాలను తీసుకోవడం వల్ల శరీరంలోని అనేక కీలక విధులు సక్రమంగా కొనసాగుతాయి. పండ్లు, కూరగాయల్లో ఉండే యాంటీ ఆక్సిడెంట్లు శరీరంలో ఆక్సిడేటివ్ స్ట్రెస్‌ను ఎదుర్కోవడంలో సహాయపడతాయి. అలాగే చేపల్లో లభించే ఒమెగా-3 కొవ్వు ఆమ్లాలు గుండె, మెదడు ఆరోగ్యానికి మేలు చేస్తాయి. అందువల్ల ముందుగా రోజువారీ ఆహారం ద్వారా మనకు ఏయే పోషకాలు అందుతున్నాయో తెలుసుకోవడం అవసరం.

**విటమిన్ బి12..**

విటమిన్ బి12 ప్రధానంగా జంతు ఆధారిత ఆహారాల్లో లభించే నీటిలో కరిగే విటమిన్. ఎర్ర రక్త కణాలు, డీఎన్‌ఏ తయారీలో ఇది కీలక పాత్ర పోషిస్తుంది. నాడీ వ్యవస్థ సక్రమంగా పనిచేయడానికి కూడా ఇది అవసరం. విటమిన్ బి12 లోపిస్తే రక్తహీనతతోపాటు జ్ఞాపకశక్తి తగ్గడం, ఆలోచనా సామర్థ్యానికి సంబంధించిన సమస్యలు వంటి నాడీ సంబంధిత ఇబ్బందులు తలెత్తుతాయి. ఉడికించిన గుడ్డు, ఫోర్టిఫైడ్ సిరియల్స్, పెరుగు, పాలు, సాల్మన్ చేపలు బి12కు మంచి ఆహార వనరులుగా సూచిస్తున్నారు. విటమిన్ సి శక్తివంతమైన యాంటీఆక్సిడెంట్‌గా పనిచేస్తుంది. ఇది రోగనిరోధక వ్యవస్థకు మద్దతు ఇవ్వడంతోపాటు చర్మం, కార్టిలేజ్, రక్తనాళాల ఆరోగ్యానికి ఉపయోగపడుతుంది. గాయాలు మానడానికి అవసరమైన కొల్లాజెన్ తయారీలో కూడా ఇది కీలకం. మొక్కల ఆధారిత ఆహారాల్లో ఉండే ఇనుమును శరీరం గ్రహించడానికి విటమిన్ సి సహాయపడుతుంది. టమాటాలు, స్ట్రాబెర్రీలు, కివీ, నారింజ, ఎర్ర క్యాప్సికమ్, జామ వంటి వాటిలో విటమిన్ సి సమృద్ధిగా ఉంటుంది.

ఒమెగా 3 కొవ్వు ఆమ్లాలు..ఒమెగా-3 కొవ్వు ఆమ్లాలు శరీరానికి అవసరమైన పాలీఅన్‌శాచురేటెడ్ కొవ్వుల్లో ఒకటి. ఈపీఏ, డీహెచ్‌ఏ, ఏఎల్‌ఏ వంటి ఒమెగా-3 రకాలు గుండె, మెదడు ఆరోగ్యానికి ముఖ్యమైనవి. ఇవి శరీరంలో వాపులను తగ్గించడంలో సహాయపడడంతోపాటు గుండె జబ్బులు, ఆర్థరైటిస్ వంటి దీర్ఘకాలిక సమస్యల ప్రమాదాన్ని తగ్గించడంలో కీలకపాత్ర పోషిస్తాయని చెబుతున్నారు. మొక్కల ఆధారిత ఏఎల్‌ఏ కోసం కనోలా ఆయిల్, అవిసె గింజలు, వాల్‌నట్స్, చియా గింజలు, అవిసె గింజల నూనె తీసుకోవచ్చు. ఈపీఏ, డీహెచ్‌ఏ కోసం సాల్మన్, హెర్రింగ్ వంటి చేపలు మంచి వనరులు. పొటాషియం శరీరంలో ద్రవ సమతుల్యతను కాపాడటంతోపాటు నాడుల పనితీరు, కండరాల సంకోచాలకు అవసరం. రక్తపోటును నియంత్రించడంలో కూడా ఇది కీలక పాత్ర పోషిస్తుంది.



# 'ఎవ్వరినీ వదిలిపెట్టను'

## 'చుట్టమల్లే' మార్ఫింగ్ వీడియోపై ఎన్టీఆర్ ఫైర్

ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్?ను దుర్వినియోగం చేస్తూ క్రియేట్ చేసిన 'చుట్టమల్లే ' సాంగ్ మార్ఫింగ్ వీడియోపై స్టార్ నటుడు జూనియర్ ఎన్టీఆర్ స్పందించారు. ఏఐని ఉపయోగించి ఇలాంటి పనులు చేయడాన్ని నీచమైన చర్యగా అభివర్ణించారు. ఇది అసహ్యకరమైన, రోత పుట్టించే సిగ్గుమాలిన చర్య అని మండిపడ్డారు. దీని వెనుక ఉన్న వాళ్లను ఎవరినీ వదిలిపెట్టబోనని హెచ్చరించారు. ఈ మేరకు ఎక్స్? వేదికగా ఓ పోస్టు పెట్టారు. 'స్త్రీలను తల్లులుగా, దేవతలుగా పూజించే గడ్డ ఇది. ఈ 'మాతృదేవో భవ' అనేది ఒక మాట మాత్రమే కాదు. ఇది మన సంస్కృతిలో భాగం. అలాంటి ఈ గడ్డపై పుట్టిన కొందరు వ్యక్తులు, ఒక స్త్రీని అత్యంత నీచమైన రీతిలో అవమానించడానికి ఏఐని ఉపయోగించేలా దిగజారిపోయారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్?ను ఇంతటి నీచమైన దాన్ని సృష్టించేందుకు ఉపయోగించడం మాటల్లో చెప్పలేనంత సిగ్గుచేటు. చుట్టమల్లె వీడియోను మార్ఫింగ్ చేసిన ఘటన వెనుక ఉన్న వాళ్లను ఎవ్వరినీ నేను వదిలిపెట్టను. దీన్ని సృష్టించిన వారిపై, సోషల్ మీడియాలో వ్యాప్తి చేస్తున్న వారిపైనా చట్టపరమైన చర్యలు తీసుకుంటాను. దయచేసి ఇలాంటి కంటెంట్?ను చూడవద్దు, ఇతరులకు షేర్ చేయవద్దని విజ్ఞప్తి చేస్తున్నాను. ఈరోజు ఒకరికి జరిగింది. రేపు మీ తల్లి, సోదరి, భార్య లేదా కుమార్తె కావచ్చు. ఇది ఒక తీవ్రమైన సమస్య. ఏఐ దుర్వినియోగం చేయకుండా కఠినమైన నిబంధనలను తీసుకురావాలని నేను రాష్ట్ర, భారత ప్రభుత్వాన్ని కోరుతున్నాను' అని ఎన్టీఆర్ ఎక్స్?లో పోస్టు చేశారు. అయితే చుట్టమల్లే పాటను ఎవరో ఏఐ ఉపయోగించి మార్ఫింగ్ చేసి సోషల్ మీడియాలో వైరల్ చేశారు. దీనిపైనే ఎన్టీఆర్ ఫైర్ అయ్యారు. ? కాగా, 2024లో వచ్చిన దేవర సినిమాలోని చుట్టమల్లే పాట సూపర్ హిట్టయ్యింది. ఇందులో ఎన్టీఆర్- జాన్వీ కపూర్ డాన్స్ ఆకట్టుకుంది. రామజోగయ్య శాస్త్రి ఈ పాటకు లిరిక్స్ అందించగా, శిల్పా రావు ఆలపించారు. అనిరుధ్ రవిచంద్రన్ సంగీతం అందించారు. ఈ పాటకు యూట్యూబ్?లో 100o మిలియన్ వ్యూస్ వచ్చాయి. కాగా, హీరోయిన్లు డీప్?ఫేక్ బారిన పడడం ఇదే తొలిసారి కాదు. గతంలోనూ పలు ఇండస్ట్రీలకు చెందిన హీరోయిన్లకు ఇలాంటి చేదు అనుభవం ఎదురైంది. మార్ఫింగ్ వీడియోలతో సోషల్ మీడియాలో ట్రోలింగ్ ఎదుర్కొన్నారు. ఇటీవల 'అర్జున్ రెడ్డి' ఫేమ్ హీరోయిన్ శాలిని పాండే కూడా ఏఐ డీప్?ఫేక్ బారిన పడ్డారు. ఆమెపై అభ్యంతరకరంగా వీడియోలు రూపొందించి సోషల్ మీడియాలో వైరల్ చేశారు. ఈ వీడియోలపై శాలిని ఆవేదన వ్యక్తం చేశారు. సదరు వీడియోలను ఎవరు షేర్ చేయొద్దని, డౌన్?లోడ్ చేయొద్దని కోరారు. అంతకుముందు మృణాల్ ఠాకూర్, కీర్తి సురేశ్, రష్మిక మంధన్నా, కత్రినా కైఫ్?కు కూడా ఇలాంటి చేదు అనుభవం ఎదురైంది. ఇలాంటి వాటిపై పలువురు ఇప్పటికే చట్టపరమైన చర్యలు తీసుకున్నారు.

# 'ది ప్యారడైజ్' వసూళ్లే సాక్ష్యం..






నిర్మాత, దర్శకుడు తమ్మారెడ్డి భరద్వాజ

సినిమా రివ్యూలకు, బాక్సాఫీస్ కలెక్షన్లకు ప్రత్యక్ష సంబంధం ఉండదని సీనియర్ నిర్మాత, దర్శకుడు తమ్మారెడ్డి భరద్వాజ స్పష్టం చేశారు. ఇటీవల విడుదలైన నాని పీరియడ్ యాక్షన్ డ్రామా 'ది ప్యారడైజ్' విజయాన్నే ఇందుకు నిదర్శనంగా ఆయన పేర్కొన్నారు. శ్రీకాంత్ ఓదెల దర్శకత్వంలో వచ్చిన ఈ చిత్రానికి మిశ్రమ, నెగెటివ్ రివ్యూలు వచ్చినా వసూళ్లు నిలకడగా ఉన్నాయని ఆయన తెలిపారు. ఓ ఇంటర్వ్యూలో మాట్లాడిన తమ్మారెడ్డి, "ది ప్యారడైజ్ సినిమా ప్రపంచవ్యాప్తంగా ఇప్పటికే రూ.150 కోట్లకు పైగా గ్రాస్ వసూలు చేసింది. ఒక్క భారత మార్కెట్లోనే రూ.120 కోట్ల వరకు రాబట్టింది. సినిమాను అధిక ధరలకు కొనుగోలు చేసిన బయ్యర్లు ప్రస్తుతం నష్టాల నుంచి బయటపడుతున్నారు. నైజాం ఏరియా డిస్ట్రిబ్యూటర్లు లాభాల్లోకి అడుగుపెట్టారు" అని వివరించారు. "రివ్యూలకు, వసూళ్లకు సంబంధం లేదని నేను మొదటి నుంచి చెబుతున్నాను. ఒకవేళ నెగెటివ్ రివ్యూల ప్రభావం నిజంగా ఉంటే, సినిమా వసూళ్లు వెంటనే పడిపోవాలి.ం

కానీ ఈ చిత్రం రూ.100 కోట్ల మార్కును దాటి ఇప్పటికీ నిలబడింది" అని తమ్మారెడ్డి వ్యాఖ్యానించారు. సినిమాపై ఉద్దేశపూర్వకంగా నెగెటివ్ ప్రచారాలు జరిగాయని తాను భావించడం లేదని, కానీ డబ్బులిచ్చి ఒక సినిమాను దెబ్బతీయడం మాత్రం మహా పాపమని ఆయన అన్నారు. ప్రేక్షకుల ఆదరణ ఉన్నప్పుడు విమర్శలు, పైరసీ వంటివి సినిమా విజయాన్ని ఆపలేవని ఆయన అభిప్రాయపడ్డారు.

## 'మొహబ్బత్' సినిమా టీజర్ ఆవిష్కరణ!



సంతోష్ రాజా, శ్రేయాస్ సేన్ ప్రధాన జంటగా నటిస్తున్న తాజా చిత్రం 'మొహబ్బత్'. ఏబీఎస్ ప్రొడక్షన్స్ పతాకంపై మ్యాక్ దర్శకత్వంలో అఫ్రోజ్ షేక్ ఈ చిత్రాన్ని అత్యంత ప్రతిష్ఠాత్మకంగా నిర్మిస్తున్నారు. రాయలసీమ నేపథ్యంలో జరిగిన యదార్థ సంఘటనల ఆధారంగా రూపుదిద్దుకుంటున్న ఈ మ్యూజికల్ ఎమోషనల్ లవ్?స్టోరీ త్వరలోనే ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ చిత్రానికి సంబంధించిన టీజర్ ఆవిష్కరణోత్సవం శుక్రవారం హైదరాబాద్?లో ఘనంగా జరిగింది. ఈ ప్రత్యేక వేడుకకు ప్రముఖ హీరో నవదీప్ మరియు టాలెంటెడ్ డైరెక్టర్ కరుణకుమార్ ముఖ్య అతిథులుగా విచ్చేశారు. వీరితో పాటు ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్ సలీమ్ షేక్, దర్శకుడు మ్యాక్, సినిమాటోగ్రఫర్ వైఎస్ కృష్ణ, రచయిత కలాం, నటులు అజయ్ ఘోష్, ఈశ్వర్ సాయి, మనోజ్, సాత్విక్, సంతోష్, దుర్గ తదితరులు ఈ కార్యక్రమంలో ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ వేదికపై చిత్ర యూనిట్ సభ్యుల సమక్షంలో హీరో నవదీప్ సినిమా టీజర్?ను ఆవిష్కరించి, చిత్ర బృందానికి శుభాకాంక్షలు తెలిపారు. నవదీప్ మాట్లాడుతూ.. నిర్మాత అఫ్రోజ్ అమెరికాలో మంచి ఉద్యోగం చేస్తూనే, తన సొంత ఊరిలో ఒక స్కూలును నిర్మించడమే కాకుండా, ఇప్పుడు తన కలల సినిమాను ప్రొడ్యూస్ చేస్తున్నారు.

## రచితా రామ్ బుగ్గలు గిల్లిన అభిమాని



కన్నడ స్టార్ హీరోయిన్, 'డింపుల్ క్వీన్'గా పేరుగాంచిన రచిత రామ్?కు తన పుట్టినరోజు వేడుకల్లో ఒక అభిమాని నుంచి ఊహించని, ఆసక్తికరమైన అనుభవం ఎదురైంది. సెల్ఫీ తీసుకున్న ఆనందంలో ఓ యువకుడు ఆమె బుగ్గలు గిల్లగా, రచిత ఏమాత్రం కోపగించుకోకుండా చిరునవ్వుతో స్పందించి తన అభిమానుల మనసు గెలుచుకున్నారు. ఈ ఘటనకు సంబంధించిన వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్?గా మారింది. వివరాల్లోకి వెళితే, ప్రతి ఏటా మాదిరిగానే ఈసారి కూడా రచిత రామ్ తన పుట్టినరోజును అభిమానుల మధ్య ఘనంగా జరుపుకున్నారు. అక్టోబర్ 3న అర్ధరాత్రి నుంచే బెంగళూరులోని ఆర్ఆర్ నగర్?లో ఉన్న ఆమె నివాసం వద్దకు భారీ సంఖ్యలో అభిమానులు చేరుకున్నారు. ఆమె నటించిన పాత్రల భారీ కటౌట్లతో ఆ ప్రాంతమంతా పండగ వాతావరణం నెలకొంది. అభిమానుల ప్రేమకు స్పందించిన రచిత, వారితో కలిసి ఫొటోలు దిగుతూ సందడి చేశారు. ఈ క్రమంలోనే ఓ యువకుడు సెల్ఫీ తీసుకున్న తర్వాత ఆప్యాయంగా ఆమె రెండు బుగ్గలను గిల్లాడు. ఈ అనూహ్య పరిణామానికి రచిత ఒక్క క్షణం ఆశ్చర్యపోయినా, వెంటనే తేరుకుని నవ్వేశారు. అభిమాని అత్యుత్సాహాన్ని ఆమె సానుకూలంగా తీసుకోవడం అందరినీ ఆకట్టుకుంది. ఈ వేడుకల్లో భాగంగా, గాయకుడు సునీల్ ఆమె కోసం ప్రత్యేకంగా స్వరపరిచిన 'అచ్చు మెచ్చు రచ్చు' అనే పాటను ఆలపించడం మరో విశేషం. అభిమానుల ప్రేమకు భావోద్వేగానికి గురైన రచిత, మైక్ అందుకుని ప్రసంగించారు. "మీరు అరవాల్సిన పనిలేదు, మీకోసం నేను అరుస్తాను" అంటూ, సరైన మార్గంలో డబ్బు సంపాదించాలని, ఇతరులకు సహాయం చేయాలని అభిమానులకు సూచించారు.

## 'రాకా'లో ఐశ్వర్య లక్ష్మి లేనట్లే?

ఐకాన్ స్టార్ అల్లు అర్జున్, దర్శకుడు అట్లీ కాంబినేషన్?లో తెరకెక్కుతున్న భారీ ప్రాజెక్ట్ 'రాకా'పై ఇప్పటికే భారీ అంచనాలు నెలకొన్నాయి. అల్లు అర్జున్ కెరీర్?లోనే అత్యంత భారీ స్థాయిలో రూపొందుతున్న ఈ సినిమాను అంతర్జాతీయ స్థాయిలో ప్రేక్షకులను ఆకట్టుకునేలా తెరకెక్కిస్తున్నట్లు చిత్రబృందం చెబుతోంది. దీంతో సినిమా కథ, నటీనటులు, సాంకేతిక నిపుణులకు సంబంధించిన ప్రతి అప్?డేట్?పై అభిమానుల్లో ఆసక్తి నెలకొంది. ముఖ్యంగా ఈ సినిమాలో అల్లు అర్జున్ సరసన పలువురు ప్రముఖ కథానాయికలు కనిపించనున్నారనే వార్తలు కొంతకాలంగా వినిపిస్తున్నాయి. దీపికా పదుకొణె, రష్మిక మందన్న, మృణాల్ ఠాకూర్ వంటి పేర్లు ఇప్పటికే ఈ ప్రాజెక్ట్?తో ముడిపడి ప్రచారంలో ఉన్నాయి. ఈ క్రమంలో మరో హీరోయిన్ పేరు కూడా తెరపైకి వచ్చింది. మలయాళంతో పాటు తెలుగు, తమిళ సినిమాల్లోనూ గుర్తింపు తెచ్చుకున్న ఐశ్వర్య లక్ష్మి 'రాకా'లో నటించబోతున్నారంటూ ఇటీవల సోషల్ మీడియాలో ప్రచారం జరిగింది. ఈ వార్త అభిమానుల్లోనూ ఆసక్తిని పెంచింది.

